PRGI TGTEL/26/A7432

# సిటీటైమ్స్

తెలుగు దినపత్రిక

Hyderabad | Adilabad | Rangareddy | Nalgonda | Medak | Mahaboobnagar | Karimnagar | Warangal | Khammam | Nizamabad

సంపుటి - 01 | సంచిక - 53 | హైదరాబాద్ | ఆదివారం | తేదీ:25.10.2026 | పేజీలు 08 | వెల రూ.3 | epaper.citytimesdaily.com

## శబరిమల అయ్యప్ప నెయ్యిలో అక్రమాలు



2లో..

## తమిళనాడులో వర్ష బీభత్సం



2లో..

## రాజీవ్‌తో ప్రేమ జ్ఞాపకాలు

- ఎక్స్ లో తొలి పోస్టులో సోనియా గాంధీ
- కేంబ్రిడ్జ్‌లోని ఒక చిన్న గ్రీక్ రెస్టారెంట్‌లో..
- మా ప్రేమ ప్రయాణం మొదలైంది
- ప్రేమ, నవ్వులు, ఎన్నో జ్ఞాపకాలతో..
- మా ప్రపంచాన్ని ఏర్పాటు చేసుకున్నాం



న్యూఢిల్లీ, సిటీటైమ్స్

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో అధికారికంగా అడుగుపెట్టారు. తన తొలి పోస్ట్‌లోనే మాజీ ప్రధాని రాజీవ్ గాంధీతో ఉన్న మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 2లో..

## రక్షణ రంగంలో భారత్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దాలి

- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- రక్షణ రంగానికి తెలంగాణ హబ్‌గా మారాలి
- పెట్టుబడులను రెట్టింపు చేయండి
- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల లక్ష్యం
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ
- దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతం
- డిఫెన్స్ పాలసీ 2.0 త్వరలో విడుదల
- రక్షణ ఎగుమతుల్లో భారత్ అగ్రగామి కావాలి
- డిసెంబర్ 7 నుంచి రక్షా ఎక్స్‌పో-2026



హైదరాబాద్, సిటీటైమ్స్

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా 'రక్షా ఎక్స్‌పో-2026'ను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నగరంలోని తాజ్ ఫలక్‌నుమాలో నిర్వహించిన 'రక్షా ఎక్స్‌పో-2026' కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు రక్షణ రంగ నిపుణులు, సాయుధ దళాల అధికారులు, డిఫెన్స్ కంపెనీల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ''ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ లో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నాం. అంతర్జాతీయ వేదికపై రక్షా ఎక్స్‌పోను తీర్చిదిద్దాలన్నది నా ఆలోచన. హైదరాబాద్ ఒక వ్యూహాత్మక ప్రదేశంగా దేశంలో కీలకమైన స్థానంలో ఉంది. 2లో..

## బషీర్‌బాగ్‌లో రాముడి విగ్రహం తొలగింపు

- దసరా రోజున ప్రతిష్ఠించిన హిందూ సంఘాలు
- కూడలి పేరు మార్పుపై పలువురు అభ్యంతరం
- తొలగింపునకు గల కారణాలపై..
- అధికారుల నుంచి స్పష్టత రావాల్సి ఉంది

8లో..



## రాజకీయాలకు అతీతంగా సహకరించాలి

- తెలంగాణకు సూపర్ ఎల్ నినో ముప్పు
- డిప్యూటీ సీఎం భట్టి కీలక విజ్ఞప్తి
- 71 శాతం చెరువుల్లో తగ్గిన నీటిమట్టాలు
- 20,018 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్
- నీటిని పొదుపుగా వాడాలని ప్రజలకు విజ్ఞప్తి





హైదరాబాద్, సిటీటైమ్స్

ఖమ్మంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్రంలో తలెత్తిన తీవ్ర వాతావరణ పరిస్థితులు, విద్యుత్ డిమాండ్ , తాగునీటి లభ్యతపై కీలక ప్రకటనలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా వంద దేశాల్లో 'సూపర్ ఎల్ నినో' ప్రభావం తీవ్రంగా ఉందని, దీనివల్ల భవిష్యత్తులో గడ్డు పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. లండన్ వంటి అంతర్జాతీయ నగరాల్లోనూ తాగునీటి వృథాను అరికడుతున్నారని, మహారాష్ట్రలో ఇప్పటికే నీటి వాడకంపై కోటాలు విధించారని గుర్తుచేశారు. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

రాజకీయ విమర్శలు పక్కనపెట్టి ప్రభుత్వానికి సహకరించాలి

కష్టకాలంలో కేవలం రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయడం సరికాదని డిప్యూటీ సీఎం హితవు పలకారు. కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు దేశవ్యాప్తంగా ప్రభుత్వాలకు ఏ విధంగానైతే అందరూ సహకరించారో, ప్రస్తుత ఎల్ నినో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలోనూ ప్రతిపక్షాలు అదే విధంగా బాధ్యతయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో తాగునీటి సమస్యను అధిగమించడానికి లభించే ప్రతి చుక్క నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజకీయ ప్రకటనలు మాని, ప్రజల మనుగడ కోసం అందరూ ఉన్నతమైన ఆలోచనలతో ముందుకు రావాలని కోరారు.

**క్షీణిస్తున్న నీటి వనరులు.. ఏడాదిపాటు సరిపడా ఆహార నిల్వలు**

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా దాదాపు 71 శాతం చెరువుల్లో నీటిమట్టాలు గణనీయంగా క్షీణించినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. 8లో..

## జర్నలిస్టుల సొంతింటి కల సాకారం చేస్తాం

- ఇళ్ల స్థలాలపై మంత్రి పొంగులేటి కీలక ప్రకటన
- న్యాయపరమైన చిక్కులు లేని విధంగా
- స్థలాలను కేటాయిస్తామని స్పష్టం చేశారు
- నివాసయోగ్యమైన ప్రాంతంలో ఇళ్లస్థలాలు



2లో..

## కాళేశ్వరం పునరుద్ధరణకు ఆర్మీ ఇంజనీర్

- బీఆర్ఎస్ తీరుపై మంత్రి ఉత్తమ్ ఫైర్
- ప్రాజెక్టు అంచనా వ్యయంపై ఆరోపణలు
- కాంగ్రెస్ హయాంలో రికార్డు పంట ఉత్పత్తి



8లో..

హైదరాబాద్, సిటీటైమ్స్

సచివాలయంలో జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పెద్దలు తెలంగాణ ప్రజలకు అబద్ధాలు, అసత్యాలు చెబుతూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు రిహాబిలిటేషన్ పనుల కోసం ఆర్మీలో పనిచేస్తున్న నిపుణ ఇంజనీర్ పరిక్షిత్ మెహ్రాను రాష్ట్ర ప్రభుత్వం డిప్యుటేషన్‌పై నియమించిందని వెల్లడించారు. దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, అంతర్జాతీయ స్థాయి నిపుణుల సహాయంతో కాళేశ్వరం బ్యారేజీ పునరుద్ధరణ పనులను అప్పగించామని స్పష్టం చేశారు. ఏలాంటి రాజకీయ రంగు పులమకుండా పూర్తి పారదర్శకతతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

## పవర్‌గ్రిడ్ మహిళల వాష్‌రూమ్‌లో రహస్య కెమెరా కలకలం

### అటెండెంట్ అరెస్ట్.. సైబర్ క్రైమ్‌కు కేసు బదిలీ



హైదరాబాద్, సిటీటైమ్స్

హైదరాబాద్ నగరంలోని కవాడిగూడలో ఉన్న పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ కార్యాలయంలో దారుణ ఘటన వెలుగుచూసింది. మహిళల వాష్‌రూమ్‌లో రహస్యంగా మొబైల్ ఫోన్ అమర్చి అనుచితంగా వీడియోలు చిత్రీకరించేందుకు ప్రయత్నించిన ఘటన ఉద్యోగుల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై చర్యలు చేపట్టిన పోలీసులు ఫ్లోర్ అటెండెంట్‌గా పనిచేస్తున్న భరత్‌ను అరెస్ట్ చేశారు. 8లో..

## ఆర్టికల్ 370 కోసం ఉద్యమిస్తాం



8లో..

## సీఎం ఇంట్లో ఏసీ కూడా పనిచేయదు

- ఎంపీ రఘునందన్ రావు
- గ్రామాల్లో సోలార్ పానెళ్లను ఏర్పాటు చేస్తే..
- కనీసం వచ్చే సంవత్సరం అయినా కరెంట్ కోతలు ఉండవు

2లో..



హైదరాబాద్, సిటీటైమ్స్

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకదానిపై ఒకటి విమర్శలు చేసుకోవడం ఆపేసి గ్రామాల్లో సోలార్ పానెళ్లను ఏర్పాటు చేస్తే.. కనీసం వచ్చే సంవత్సరం అయినా కరెంట్ కోతలు ఉండవని.. ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సెక్రటేరియట్ లో సీఎం లిఫ్ట్, ఇంట్లో ఏసీ కూడా పనిచేయని పరిస్థితి వస్తోందని ఎంపీ రఘునందన రావు హెచ్చరించారు. 'కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలు మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుని.. ఒకదానిపై మరోటి విమర్శలు చేసుకుంటాయి తప్ప అభివృద్ధి చేయాలనే ఆలోచన వాటికి లేదు. కరెంటు ఇవ్వడం లేదు.

## తెలంగాణలో భారీగా డ్రగ్స్

- మూడిసరుకు ఫ్యాక్టరీ గుట్టురట్టు
- ముంబై బృందాలు ఆకస్మిక మెరుపు దాడులు
- 27 లక్షల విలువైన 44.699 కిలోలు స్వాధీనం

2లో..

సిటీటైమ్స్ తెలుగు దినపత్రిక
www.citytimesnews.com
GENERAL NEWS
epaper.citytimesdaily.com



## జర్నలిస్టుల సొంతింటి
# కల సాకారం చేస్తాం

**- జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**

హైదరాబాద్, సిటీటైమ్స్

జర్నలిస్టులకు ఇళ్లస్థలాలపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం కీలక ప్రకటన చేశారు. జర్నలిస్టుల సొంతింటి కల సాకారం చేస్తామని.. వారికి ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. న్యాయపరమైన చిక్కులు లేని విధంగా స్థలాలను కేటాయిస్తామని స్పష్టం చేశారు. నివాసయోగ్యమైన ప్రాంతంలో ఇళ్లస్థలాలు అందిస్తామని చెప్పుకొచ్చారు. జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఇళ్లస్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డితో పలుమార్లు ఈ విషయంపై చర్చించామని మంత్రి పొంగులేటి తెలిపారు. జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ అంశంపై సమీక్షిస్తున్నామని అన్నారు. గతంలో న్యాయపరమైన చిక్కులతో స్థలాల ప్రక్రియ నిలిచిపోయిందని ప్రస్తావించారు. 2008లో జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి భూముల కేటాయింపునకు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌తో ఇళ్ల స్థలాల ప్రక్రియ నిలిచిపోయిందని వెల్లడించారు. 2022లో న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయని చెప్పారు. 2024 సెప్టెంబర్ 8వ తేదీన జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి భూమి అప్పగించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

# సీఎం ఇంట్లో ఏసీ కూడా పనిచేయదు



హైదరాబాద్, సిటీటైమ్స్

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకదానిపై ఒకటి విమర్శలు చేసుకోవడం ఆపేసి గ్రామాల్లో సోలార్ పానెళ్లను ఏర్పాటు చేస్తే.. కనీసం వచ్చే సంవత్సరం అయినా కరెంట్ కోతలు ఉండవని.. ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సెక్రటేరియట్‌లో సీఎం లిఫ్ట్, ఇంట్లో ఏసీ కూడా పనిచేయని పరిస్థితి వస్తోందని ఎంపీ రఘునందన రావు హెచ్చరించారు. 'కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలు మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుని.. ఒకదానిపై మరోటి విమర్శలు చేసుకుంటాయి తప్ప అభివృద్ధి చేయాలనే ఆలోచన వాటికి లేదు. కరెంటు ఇవ్వడం లేదు. సూర్యుడు ఉచితంగా కరెంటును ఇస్తున్నాడు కదా.. ప్రతి ఇంటి మీద రెండు కిలోవాట్ల సోలార్ పెట్టమని ఆ పార్టీ ఎమ్మెల్యేలకు ఎందుకు చెప్పడం లేదు. 50% ఇళ్ల మీద సోలార్ అమర్చితేనే.. పంచాయతీ నిధులు ఇస్తామని ఎందుకు చెప్పడం లేదు. ప్రతి ఇంటికి రెండు కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ అమరికపై కేంద్రప్రభుత్వం 60% సబ్సిడీ ఇస్తుంది కదా.. వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు వినియోగించుకోవట్లేదు. మల్లన్న సాగర్ ప్రాజెక్టుకు కాలువలు కట్టలేదు. గత ముఖ్యమంత్రికి ఆ కాంట్రాక్టర్ దోస్తు. ఈ ముఖ్యమంత్రికి కూడా ఆ కాంట్రాక్టర్ దోస్తే. మరి అందరు దోస్తులయితే దుబ్బాక కాలువలు ఎవరు తవ్వుతారు' అని ఎంపీ రఘునందన్ రావు ఎద్దేవా చేశారు.

# తెలంగాణలో భారీగా డ్రగ్స్

హైదరాబాద్, సిటీటైమ్స్

తెలంగాణలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న డ్రగ్స్ ముడిసరుకు తయారీ రాకెట్‌ను ముంబై క్రైమ్ డిటెక్షన్ బ్రాంచ్ పోలీసులు ఛేదించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలోని ఐడీఏ పాశమైలారంలో ఉన్న ఓ పరిశ్రమపై స్థానిక పటాన్‌చెరు పోలీసుల సహకారంతో ముంబై బృందాలు ఆకస్మిక మెరుపు దాడులు నిర్వహించాయి.

ఈ సోదాల్లో ఎండీ డ్రగ్స్ తయారీలో అత్యంత కీలకమైన '2బ్రోమో4మిథైల్ ప్రొపియోఫినోన్' రసాయన పొడిని తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఫ్యాక్టరీ నుంచి దాదాపు రూ.27 లక్షల విలువైన 44.699 కిలోల రసాయన పొడితో పాటు, తయారీకి వినియోగించే ఇతర ద్రవ రసాయనాలు, ల్యాబ్ యంత్ర పరికరాలను సీజ్ చేశారు. ఈ అక్రమ యూనిట్ నిర్వాహకుడు రమేష్‌బాబు సాకేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

దేశవ్యాప్త డ్రగ్స్ నెట్‌వర్క్‌ను కూపీ లాగుతున్న ముంబై క్రైమ్ బ్రాంచ్.. గతంలో గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లలోనూ భారీగా ఎండీ తయారీ కేంద్రాలను గుట్టురట్టు చేసింది. ఈ డ్రగ్స్ దందా కేసులో ఇప్పటివరకు మొత్తం 25 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటిదాకా నిర్వహించిన దాడుల్లో మొత్తం 69.871 కిలోల ఎండీ డ్రగ్స్, 260 లీటర్ల ముడి రసాయనాలు, భారీగా నగదు, ల్యాబ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ డ్రగ్స్ తయారీ ముఠా వెనుక ఉన్న సూత్రధారులు, ఆర్థిక లావాదేవీలు మరియు అంతర్రాష్ట్ర సరఫరా నెట్‌వర్క్‌పై ముంబై పోలీసులు లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# రక్షణ రంగంలో భారత్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దాలి

హైదరాబాద్, సిటీటైమ్స్

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా 'రక్షా ఎక్స్‌పో2026'ను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నగరంలోని తాజ్ ఫలక్‌నుమాలో నిర్వహించిన 'రక్షా ఎక్స్‌పో2026' కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు రక్షణ రంగ నిపుణులు, సాయుధ దళాల అధికారులు, డిఫెన్స్ కంపెనీల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నాం. అంతర్జాతీయ వేదికపై రక్షా ఎక్స్‌పోను తీర్చిదిద్దాలన్నది నా ఆలోచన. హైదరాబాద్ ఒక వ్యూహాత్మక ప్రదేశంగా దేశంలో కీలకమైన స్థానంలో ఉంది. హైదరాబాద్ అత్యంత సురక్షితమైన నగరం. సముద్రం లేకపోయినా నౌకాదళానికి రాష్ట్రం కీలకమైన సేవలు అందిస్తోంది. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా తీర్చిదిద్దాం. రక్షణ రంగంలో భారత్‌ను అగ్రగామిగా చూడాలన్నదే నా ఆకాంక్ష. రక్షణ సాంకేతిక ఎగుమతులు చేసే దేశంగా భారత్ ఎదగాలి. రక్షణ రంగ పరిశ్రమలకు తెలంగాణ అతిపెద్ద కేంద్రం కావాలని ఆకాంక్షించారు.

తెలంగాణలో పెట్టుబడులపై మీ ప్రణాళికలను రెట్టింపు చేయండి. మీ లక్ష్య సాధనలో సహకరించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. తెలంగాణను 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మార్చాలి. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలి. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యంగా.. తెలంగాణ రైజింగ్ విజన్2047 డాక్యుమెంట్‌ను విడుదల చేశాం. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతంగా సాధించాలన్నదే నా లక్ష్యం. రాజకీయంగా భేదాభిప్రాయాలున్నా.. పెట్టుబడుల విషయంలో లేవు. త్వరలోనే ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 2.0 విడుదల చేయబోతున్నాం. రక్షణ రంగంలో దేశాన్ని అగ్రగామి శక్తిగా తీర్చిదిద్దేందుకు కలిసి పనిచేద్దాం" అని సీఎం పిలుపునిచ్చారు.




RAKSHA EXPO 2026

# శబరిమల అయ్యప్ప నెయ్యిలో అక్రమాలు




**- 11 వేల లీటర్ల నెయ్యి మళ్లింపు**
**- రూ.2.5 కోట్ల నష్టం, కాంట్రాక్టర్ అరెస్ట్!**

తిరువనంతపురం, సిటీటైమ్స్

కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్ప స్వామి ఆలయానికి సరఫరా చేయాల్సిన నెయ్యి వ్యవహారంలో భారీ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఆలయానికి చేరాల్సిన సుమారు 11 వేల లీటర్ల మిల్మా నెయ్యిని పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వచ్చాయి. దాని స్థానంలో తక్కువ ధర కలిగిన నెయ్యిని సరఫరా చేసినట్లు ఆరోపణలు రావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంలో రవాణా కాంట్రాక్టర్ ఎస్ఎస్ బినును కేరళ విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో (వీఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. ఈ అక్రమాల వల్ల ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ)కి సుమారు రూ.2.5 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

శబరిమల ఆలయంలో స్వామివారికి నైవేద్యంగా సమర్పించే అరవణ పాయసంలో నెయ్యి కీలక పదార్థం. ఎర్ర బియ్యం, బెల్లం, నెయ్యితో తయారు చేసే ఈ తీపి ప్రసాదాన్ని భక్తులకు అందిస్తారు. ఈ పాయసం తయారీ కోసం ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు కేరళ కో ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్‌కు చెందిన మిల్మా బ్రాండ్ నెయ్యిని కొనుగోలు చేసింది. 2025 తీర్థయాత్ర సీజన్‌లో శబరిమల ఆలయానికి నెయ్యిని రవాణా చేసే కాంట్రాక్టును ఎస్ఎస్ బినుకు అప్పగించారు. అంతకు ముందు పథనంతిట్టలోని మిల్మా డెయిరీకి నెయ్యి సరఫరా కాంట్రాక్టును నేరుగా కేటాయించినట్లు సమాచారం. ఈ సరఫరా ప్రక్రియలో టెండర్లు లేదా కొటేషన్లు ఆహ్వానించకపోవడంపై కూడా ప్రశ్నలు తలెత్తాయి.

విజిలెన్స్ అధికారుల ఆరోపణల ప్రకారం.. శబరిమలకు పంపాల్సిన అసలు మిల్మా నెయ్యిని తమిళనాడులోని రెండు సంస్థలకు మళ్లించారు. దాని స్థానంలో తక్కువ ధర కలిగిన ఉత్పత్తిని ఆలయానికి సరఫరా చేసినట్లు దర్యాప్తు సంస్థ అనుమానిస్తోంది. తమిళనాడులోని ఒట్టంచత్రం ప్రాంతంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్, లియో ట్రేడర్స్ సంస్థలకు అసలు నెయ్యి చేరినట్లు అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో నకిలీ ఇన్వాయిస్‌లతో పాటు ఇతర తప్పుడు పత్రాలను ఉపయోగించి ఉండవచ్చని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

11 వేల లీటర్ల నెయ్యి మళ్లింపు, దాని స్థానంలో చౌక ఉత్పత్తిని సరఫరా చేసిన వ్యవహారం వల్ల ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డుకు సుమారు రూ.2.5 కోట్ల ఆర్థిక నష్టం జరిగినట్లు విజిలెన్స్ అధికారులు అంచనా వేశారు. ఈ నష్టానికి సంబంధించిన తుది లెక్కలు, అక్రమాల్లో ఇతరుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది. శబరిమల ఆలయానికి సరఫరా చేసిన నెయ్యి కొనుగోలు ప్రక్రియ, నాణ్యతపై అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో కేరళ హైకోర్టు ఆదేశాలతో ఈ కేసు దర్యాప్తు ప్రారంభమైంది. విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో ప్రత్యేక దర్యాప్తు విభాగం ఈ వ్యవహారాన్ని పరిశీలిస్తోంది.

ఈ కేసులో భాగంగా అధికారులు శుక్రవారం బినును విచారణకు పిలిచారు. విచారణ అనంతరం అతడిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో నమోదైన తొలి అరెస్ట్ ఇదేనని వెల్లడించారు. నెయ్యి రవాణా, సరఫరా, కొనుగోలు ప్రక్రియల్లో ఎవరెవరి పాత్ర ఉందనే అంశాలపై అధికారులు మరింత సమాచారం సేకరిస్తున్నారు. శబరిమల ఆలయానికి దేశవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. అక్కడ అందించే అరవణ పాయసం భక్తులకు ఎంతో ప్రాధాన్యమైన ప్రసాదం. ఈ నేపథ్యంలో ప్రసాదం తయారీకి వినియోగించే నెయ్యి సరఫరాలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు భక్తుల్లో తీవ్ర ఆందోళనకు కారణం అవుతున్నాయి.

ఆహార పదార్థాల కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు, సరఫరా గొలుసు పర్యవేక్షణ, రవాణా కాంట్రాక్టుల పారదర్శకత ఎంత ముఖ్యమో ఈ ఘటన మరోసారి చర్చకు తెచ్చింది. అసలు నెయ్యిని ఎక్కడికి తరలించారు.. దాని స్థానంలో ఏ ఉత్పత్తిని సరఫరా చేశారు.. ఈ వ్యవహారంలో మరెవరైనా భాగస్వాములుగా ఉన్నారా.. అనే అంశాలపై దర్యాప్తు ద్వారా స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం కాంట్రాక్టర్ అరెస్టుతో కేసు కీలక దశకు చేరుకుంది. విజిలెన్స్ అధికారులు సేకరిస్తున్న ఆధారాలు, పత్రాల పరిశీలన ఆధారంగా తదుపరి

# తమిళనాడులో వర్ష బీభత్సం

**- బస్సుపై విరిగిపడిన కొండచరియలు**
**- డ్రైవర్ మృతి.. పలువురికి గాయాలు**

చెన్నై, సిటీటైమ్స్

తమిళనాడులో పలు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు చోట్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాల కారణంగా తమిళనాడులోని నీలగిరి జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. కొండచరియలు, చెట్లు విరిగిపడి తమిళనాడు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుపై పడ్డాయి. ఈ ఘోర ప్రమాదంలో బస్సు డ్రైవర్ ప్రాణాలు కోల్పోగా, కండక్టర్ తీవ్రంగా గాయపడ్డారు.

ప్రాణాలు కోల్పోయిన బస్సు డ్రైవర్‌ను జానగరాజ్, తీవ్రంగా గాయపడిన కండక్టర్‌ను కేశవన్ గా గుర్తించారు. బస్సు కూనూర్ నుంచి మెట్టుపాళయం వెళ్తుండగా మార్గ మధ్యలో ఈ ప్రమాదం సంభవించింది. ఘటన జరిగిన వెంటనే కూనూర్, మెట్టుపాళయం అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీసులు రెస్క్యూ



ఆపరేషన్ చేపట్టారు.

**ప్రమాదం నుంచి బయటపడిన 150 మంది విద్యార్థులు...**

అదేవిధంగా మెట్టుపళయం, ఊటీ మార్గంలో పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో చిక్కుకుపోయిన కేరళకు చెందిన దాదాపు 150 మంది పాఠశాల విద్యార్థులను అధికారులు కాపాడారు. ఈ సహాయక చర్యలను తమిళనాడు మంత్రులు కమలి, సంపత్ కుమార్ దగ్గరుండీ పర్యవేక్షించినట్టు తెలుస్తుంది. ఆ మార్గంలో ఇంకా పది చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. మరోవైపు దుండిగల్‌లోని అడక్కం గ్రామంలో రోడ్లు ధ్వంసమైపోయాయి. దాంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

రాకపోకలకు అంతరాయం....

ఏకధాటిగా కురుస్తోన్న వర్షాల వల్ల నీలగిరి జిల్లా అంతటా పలు చోట్ల కొండచరియలు విరిగిపడటంతో రోడ్డు కనెక్టివిటీకి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఊటీ, మెట్టుపాళయం, ఊటీ, కూనూర్ హైవేలలో కూడా కొండచరియలు విరిగిపడటంతో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మరో రెండు రోజులపాటు తమిళనాడులోని పలు ప్రాంతాల్లో వర్షాల పరిస్థితి ఇలాగే ఉంటుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈశాన్య రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ముఖ్యంగా కోయంబత్తూర్, నీలగిరి,

# రాజీవ్‌తో ప్రేమ జ్ఞాపకాలు

న్యూఢిల్లీ, సిటీటైమ్స్

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో అధికారికంగా అడుగుపెట్టారు. తన తొలి పోస్ట్‌లోనే మాజీ ప్రధాని రాజీవ్ గాంధీతో ఉన్న మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఇంగ్లాండ్‌లోని కేంబ్రిడ్జ్ నగరంలో ఒక చిన్న గ్రీక్ రెస్టారెంట్‌లో తమ మధ్య మొదలైన ప్రేమ ప్రయాణాన్ని వివరిస్తూ భావోద్వేగ వీడియోను పంచుకున్నారు.

**గ్రీక్ రెస్టారెంట్‌లో పరిచయం.. తొలి చూపులోనే ప్రేమ**

రాజీవ్ గాంధీతో తన తొలి భేటీ గురించి సోనియా గాంధీ సుదీర్ఘంగా మాట్లాడారు. ఆ రోజుల్లో ఇంగ్లాండ్‌లో లభించే ఆహారం తనకు అస్సలు నచ్చేది కాదని, సొంత ఊరి రుచులకు దగ్గరగా ఉండే తిండి కోసం వెతుకుతుండగా కేంబ్రిడ్జ్‌లోని 'వార్సిటీ రెస్టారెంట్' అనే గ్రీక్ హోటల్ కనిపించిందని ఆమె తెలిపారు. ఆ రెస్టారెంట్‌కు యూరోపియన్, భారతీయ విద్యార్థులు ఎక్కువగా వచ్చేవారని పేర్కొన్నారు. "ఆ చిన్న గ్రీక్ రెస్టారెంట్‌లోనే నేను రాజీవ్‌ను మొదటిసారి కలిశాను" అని సోనియా గాంధీ వెల్లడించారు. ఒక కామన్ ఫ్రెండ్ తమను పరిచయం చేశారని, రాజీవ్‌ను చూడగానే ఆయనతో జీవితాన్ని పంచుకోవాలనే భావన క్షణాల్లో కలిగిందని ఆమె చెప్పారు. రాజీవ్ మనసులోనూ అదే అభిప్రాయం వ్యక్తమైందని పేర్కొన్నారు.

ఆ సాధు స్వభావమే నా మనసును తాకింది

పరిచయం తర్వాత వారిద్దరి మధ్య స్నేహం బలపడింది. ఇద్దరూ కలిసి విందులు, విహారయాత్రలు, విద్యార్థుల సమావేశాలకు వెళ్లేవారు. ఒక వాలెంటైన్స్ డే వేడుకలోనూ పాల్గొన్నట్లు సోనియా గుర్తుచేసుకున్నారు. "ఆయన ఎంతో అందంగా ఉండేవారు. అందం కంటే ఆయనలోని సాధు స్వభావం, నమ్రత నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మొదటిసారి చూసినప్పుడు కలిగిన ఆ అనుభూతిని నేను ఎప్పటికీ మరచిపోలేను" అని సోనియా గాంధీ తన మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు.

నవంబర్ 10న 'బిలాంగింగ్' పుస్తకం విడుదల





సోనియా గాంధీ రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్' నవంబర్ 10న విడుదల కానుంది. ఈ పుస్తక ఆవిష్కరణ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ వీడియోను విడుదల చేశారు. "కేంబ్రిడ్జ్‌లోని ఒక చిన్న గ్రీక్ రెస్టారెంట్‌లో నా ప్రేమ ప్రయాణం మొదలైంది. రాజీవ్, నేను కలిసి ప్రేమ, నవ్వులు, తీపి జ్ఞాపకాలతో ఒక ప్రత్యేక ప్రపంచాన్ని నిర్మించుకున్నాం. నవంబర్ 10న ఆ ప్రపంచాన్ని మీతో పంచుకోబోతున్నాను," అని సోనియా గాంధీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

"ఒక అందమైన కలలాంటి కథ" పవన్ ఖేరా స్పందన

సోనియా గాంధీ ఎక్స్ ఎంట్రీపై కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా స్పందించారు. రాజీవ్, సోనియా గాంధీల జీవిత ప్రయాణం ప్రేమ, నిబద్ధత, విషాదాల కలబోత అని ఆయన అభివర్ణించారు. "సోనియా జీ, రాజీవ్ జీ ప్రేమకథ ఒక వేసవి రాత్రి కనే అందమైన కల లాంటిది. ఒక చీకటి విషాద మేఘం ఆ కలలను కమ్మేసే వరకు అది ఎంతో నిర్మలంగా, అద్భుతంగా సాగింది" అని పవన్ ఖేడా పేర్కొన్నారు.

# తెలంగాణను గ్లోబల్ ఏఐ హబ్‌గా తీర్చిదిద్దుతాం: శ్రీధర్‌బాబు

- ఘనంగా ముగిసిన జీడీజీ హైదరాబాద్ 'డెవ్‌ఫెస్ట్–2026'
- యువ ఆవిష్కర్తల నుంచే తదుపరి సాంకేతిక విప్లవం రావాలి
- సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా 'తెలంగాణ ఏఐ మంత్రి' డిజిటల్ అవతార్.. 3 వేల మందికి పైగా టెక్నాలజీ నిపుణుల భాగస్వామ్యం



**హైదరాబాద్, అక్టోబరు 24 (సిటీటైమ్స్):**

తెలంగాణను ప్రపంచస్థాయి కృత్రిమ మేధ (ఏఐ) కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు తెలిపారు. యువతలోని సృజనాత్మక ఆలోచనలను సరికొత్త ఆవిష్కరణలుగా మలిచి, వాటిని అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్లేలా బలమైన సాంకేతిక పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గూగుల్ డెవలపర్ గ్రూప్ (జీడీజీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో జేఆర్సీ కన్వెన్షన్ అండ్ ట్రేడ్ ఫెయిర్స్‌లో శనివారం నిర్వహించిన 'డెవ్‌ఫెస్ట్-2026' ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

'ఇన్నోవేషన్ ఎట్ స్కేల్' అంశంపై ప్రసంగించిన మంత్రి.. ప్రపంచాన్ని ప్రభావితం చేసే తదుపరి గొప్ప ఏఐ ఆవిష్కరణ తెలంగాణ యువత నుంచే రావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, యువ డెవలపర్లు, అంకుర సంస్థలకు తగిన అవకాశాలు కల్పిస్తే అంతర్జాతీయ స్థాయిలో పోటీపడగల సాంకేతిక పరిష్కారాలను రూపొందించగలరని పేర్కొన్నారు. ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తూ తెలంగాణను గ్లోబల్ ఏఐ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

సదస్సులో ఏఐ మంత్రి అవతార్ ప్రత్యేక ఆకర్షణ

కార్యక్రమంలో 'తెలంగాణ ఏఐ మంత్రి' పేరుతో రూపొందించిన డిజిటల్ అవతార్‌ను ప్రదర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంత్రి ఐటీ సలహాదారు సాయికృష్ణ మార్గదర్శకత్వంలో, 'హ్యూమన్‌ఏఐ' (HumAIn) వేదికను ఉపయోగించి టెన్సర్‌గో సంస్థ ఈ అవతార్‌ను రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ నాయకత్వానికి, ప్రజలకు మధ్య సాంకేతికత ఆధారిత సంభాషణకు ఇది కొత్త మార్గాలను అందించగలదని పేర్కొన్నారు.

'బిల్డ్-సెక్యూర్-స్కేల్' ఇతివృత్తంతో నిర్వహించిన ఈ సదస్సుకు 3 వేల మందికి పైగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డెవలపర్లు, సాంకేతిక నిపుణులు, అంకుర సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. కృత్రిమ మేధ, యంత్ర అభ్యసనం, క్లౌడ్ మౌలిక సదుపాయాలు, డెవ్‌ఆప్స్, మొబైల్ సాంకేతికతలపై 30 మందికి పైగా నిపుణులు తమ అనుభవాలను పంచుకున్నారు.

ఉద్యోగార్థులు తమ వివరాలను నియామక సంస్థలకు సులభంగా అందించేందుకు ఎన్‌ఎఫ్‌సీ స్మార్ట్ బ్యాడ్జ్‌లను ప్రవేశపెట్టడం మరో ప్రత్యేకతగా నిలిచింది. గూగుల్, లాజిటెక్, మెట్లైఫ్ తదితర సంస్థలు ఏర్పాటు చేసిన నియామక కేంద్రాలు ఉద్యోగార్థులకు అవకాశాలను అందించాయి. సదస్సును పర్యావరణహితంగా, ఒకసారి వినియోగించే ప్లాస్టిక్‌కు దూరంగా నిర్వహించినట్లు జీడీజీ హైదరాబాద్ లీడ్ అర్షాద్ దెవానీ తెలిపారు. హైదరాబాద్ వేదికగా సాంకేతిక రంగ భవిష్యత్తుకు కొత్త దిశ చూపుతున్నామని పేర్కొన్నారు.



# మార్కెట్ యార్డు భవన నిర్మాణాన్ని పరిశీలించిన మంత్రి వాకిటి శ్రీహరి

- రూ.60 లక్షలతో నూతన కార్యాలయ భవన నిర్మాణం
- నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి వాకిటి శ్రీహరి

**ఆత్మకూరు సిటీ టైమ్స్ అక్టోబర్ 24**

ఆత్మకూరు లో వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధిలో భాగంగా రూ.60 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న మార్కెట్ యార్డు కార్యాలయ భవన నిర్మాణ పనులను రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, భవన నిర్మాణానికి సంబంధించిన వివరాలను మార్కెట్ యార్డు చైర్మన్ ఎండీ రహమతుల్లాను అడిగి తెలుసుకున్నారు. ఆత్మకూరు పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి మార్కెట్ యార్డుకు వివిధ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించేందుకు రైతులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో మార్కెట్ యార్డులో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. రైతులకు, మార్కెట్ యార్డు సిబ్బందికి ఉపయోగకరంగా ఉండేలా నూతన కార్యాలయ భవన నిర్మాణాన్ని చేపట్టారు. మంత్రి వాకిటి శ్రీహరి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా ఉండాలని పేర్కొన్నారు. నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణ పనులు చేపట్టాలని, పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకూడదని సూచించినట్లు తెలిసింది. మార్కెట్ యార్డులో మౌలిక సదుపాయాలు మెరుగుపడితే రైతులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు అవకాశం ఉంటుంది. నూతన కార్యాలయ భవనం అందుబాటులోకి వస్తే మార్కెట్ యార్డు పరిపాలనకు మరింత వెసులుబాటు కలగనుంది. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఎండీ రహమతుల్లా పాల్గొన్నారు.



# ప్రపంచ శాంతికి ఐరాసే వేదిక!

- మసీదుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐక్యరాజ్యసమితి దినోత్సవం
- ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు
- ఐరాస ప్రధానాంగాలు, అనుబంధ సంస్థల విధులను వివరించిన డాక్టర్ పూలపల్లి వెంకటరమణ



**శేరిలింగంపల్లి, అక్టోబరు 24 (సిటీటైమ్స్):**

ప్రపంచ దేశాల మధ్య శాంతి, భద్రతలను పరిరక్షించడంతోపాటు అంతర్జాతీయ సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడంలో ఐక్యరాజ్యసమితి కీలక పాత్ర పోషిస్తోందని చంచల్‌గూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పూలపల్లి వెంకటరమణ అన్నారు. ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మసీదుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 1945 అక్టోబరు 24న 51 దేశాలతో ఏర్పాటైన ఐక్యరాజ్యసమితిలో ప్రస్తుతం 193 దేశాలు సభ్యులుగా ఉన్నాయని వెంకటరమణ వివరించారు. యుద్ధాలను నివారించడం, అంతర్జాతీయ వివాదాలను శాంతియుతంగా పరిష్కరించడం, దేశాల మధ్య స్నేహ సంబంధాలను బలోపేతం చేయడం దీని ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. ఐరాసకు చెందిన ఆరు ప్రధానాంగాలైన సర్వప్రతినిధి సభ, భద్రతా మండలి, సచివాలయం, ధర్మకర్తృత్వ మండలి, ఆర్థిక, సామాజిక మండలి, అంతర్జాతీయ న్యాయస్థానం విధులను విద్యార్థులకు వివరించారు. యునెస్కో, యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఆహార, వ్యవసాయ సంస్థ వంటి విభాగాలు విద్య, ఆరోగ్యం, బాలల సంక్షేమం, ఆహార భద్రత రంగాల్లో అందిస్తున్న సేవలను తెలియజేశారు.

ప్రస్తుతం అగ్రరాజ్యాల ఆధిపత్య పోరు, ఉగ్రవాదం, పర్యావరణ మార్పులు ప్రపంచానికి సవాళ్లుగా మారాయని ఆయన పేర్కొన్నారు. ఐరాస భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం లభిస్తే అంతర్జాతీయ నిర్ణయాల్లో మన దేశ పాత్ర మరింత బలోపేతమవుతుందని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు ప్రపంచ శాంతి, మానవ హక్కులు, సామాజిక న్యాయం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని రజని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్, ఉపాధ్యాయుడు డాక్టర్ అంబేద్కర్, ప్రతినిధులు అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, వాణి సాంబశివరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గంగారంలో హోప్ ఫౌండేషన్ మహా అన్నదానం



- 207 వారాలుగా నిరంతర అన్నదాన సేవ.. మరో మైలురాయిని చేరుకున్న ఫౌండేషన్
- 3,350 మందికి పైగా నిరుపేదలకు భోజన వితరణ
- ఆకలిలేని సమాజమే లక్ష్యం: వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ విజయ్‌కుమార్

**చందానగర్, అక్టోబరు 24 (సిటీటైమ్స్):**

ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడమే లక్ష్యంగా హోప్ ఫౌండేషన్ సాగిస్తున్న సేవా కార్యక్రమం 207వ వారానికి చేరుకుంది. 'మానవ సేవే మాధవ సేవ' నినాదంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం గంగారంలోని కార్యాలయ ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చందానగర్-గంగారం ప్రధాన రహదారిలో జరిగిన ఈ కార్యక్రమంలో నిరుపేదలు, వృద్ధులు, వితంతువులు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో డ్రైవర్లు సహా 3,350 మందికి పైగా భోజనం వడ్డించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. సమాజంలో ఎవరూ ఆకలితో అలమటించకూడదనే సంకల్పంతో ప్రారంభించిన అన్నదాన కార్యక్రమం 207 వారాలుగా నిరంతరాయంగా కొనసాగడం ఆనందంగా ఉందన్నారు. దాతలు, కార్యకర్తల సహకారంతో భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలను ఇదే స్ఫూర్తితో కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా సంఘాల ప్రతినిధులు హోప్ ఫౌండేషన్ సేవలను అభినందించారు. ఫౌండేషన్ సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 'కల్నల్' వేషం.. ఖాకీ ముసుగులో కిడ్నాపులు!

- పోలీసు అధికారి, ఆర్మీ కల్నల్‌గా నకిలీ అవతారాలు.. తుపాకీతో బెదిరించి దోపిడీలు
- జైలు నుంచి వచ్చినా మారని తీరు.. జగద్గిరిగుట్ట పోలీసులకు చిక్కిన నిందితుడు
- గతంలో రెండుసార్లు పీడీ చట్టం ప్రయోగించినా అదే బాట.. మూడోసారి నిర్బంధం



**సైబరాబాద్, అక్టోబరు 24 (సిటీటైమ్స్):**

పోలీసు అధికారి.. ఆర్మీ కల్నల్.. ఇవీ అతడు ధరించే నకిలీ అవతారాలు. ఆ హోదాలను అడ్డుపెట్టుకుని అమాయకులను నమ్మించడం.. కేసుల పేరుతో భయపెట్టడం.. తుపాకీతో బెదిరించి కిడ్నాప్‌లు, దోపిడీలకు పాల్పడటం అతడి నేరశైలి. గతంలో రెండుసార్లు పీడీ చట్టం కింద నిర్బంధించినా తీరు మార్చుకోకపోవడంతో అంతర్రాష్ట్ర నేరారోపణలు ఎదుర్కొంటున్న నాగరాజు రఘు వర్మపై సైబరాబాద్ పోలీసులు మూడోసారి అదే చట్టాన్ని ప్రయోగించారు. పోలీసు కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ ఆదేశాలతో నిందితుడిని చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు.

ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలానికి చెందిన నాగరాజు రఘు వర్మ.. నాగరాజు కార్తికేయ రఘు వర్మ, వంశీ, అల్లూరి విజయ రామ్, కల్నల్ కార్తికేయ సింగ్ తదితర పేర్లతో చెలామణి అయినట్లు పోలీసులు పేర్కొన్నారు. 29 ఏళ్ల ఇతడు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి తొలుత డ్రైవర్‌గా పనిచేశాడు. ఆ తర్వాత సులభంగా డబ్బు సంపాదించి విలాసవంతమైన జీవితం గడపాలనే దురాశతో నేరాల బాట పట్టినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

పోలీసు ఉన్నతాధికారిగా నకిలీ గుర్తింపు పొందుతూ, బాధితులపై వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయని నమ్మించేవాడు. వాటి నుంచి తప్పిస్తానంటూ డబ్బులు వసూలు చేసేవాడు. కొన్నిసార్లు వ్యక్తులను అపహరించి, తుపాకీతో బెదిరించి నగదు, ఆస్తులను దోచుకున్నట్లు ఆరోపణలున్నాయి.

మూడుసార్లు పీడీ చట్టం.. అయినా మారని తీరు

2017 నుంచి 2026 మధ్య మోసం, కిడ్నాప్, దౌర్జన్యం, బలవంతపు వసూళ్లు, బెదిరింపులు, ఆయుధాల చట్టం కింద అతడిపై మొత్తం 14 క్రిమినల్ కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. అతడి నేరప్రవృత్తిని అడ్డుకునేందుకు 2021, 2024లో రెండుసార్లు పీడీ చట్టం ప్రయోగించారు. అయినప్పటికీ జైలు నుంచి విడుదలైన తర్వాత మళ్లీ నేరాలకు పాల్పడినట్లు, తాజాగా మరో నాలుగు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

జగద్గిరిగుట్ట పోలీసులు అతడిని అరెస్టు చేయడంతో, వరుస నేరాల నేపథ్యంలో ప్రజల భద్రతకు ముప్పుగా పరిణమించకుండా నిరోధించేందుకు సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం.రమేష్ మూడోసారి పీడీ చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# బీజేపీ రాష్ట్ర ఇన్‌ఛార్జి సునీల్ బన్సల్‌కు ఘన స్వాగతం!

- శంషాబాద్ విమానాశ్రయంలో పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించిన కసిరెడ్డి సింధూరెడ్డి, రాంభూపాల్ గౌడ్
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు
- రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతంపై నేతల మధ్య చర్చ

**శంషాబాద్, అక్టోబరు 24 (సిటీటైమ్స్):**

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి సునీల్ బన్సల్‌కు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. వివిధ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన ఆయనకు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు కసిరెడ్డి సింధూరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క రాంభూపాల్ గౌడ్, బీజేవైఎం అధ్యక్షుడు కుండె గణేష్, నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు సునీల్ బన్సల్‌కు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, యువజన విభాగం కార్యాచరణపై నాయకులు చర్చించారు. సునీల్ బన్సల్‌కు స్వాగతం పలికేందుకు బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో విమానాశ్రయానికి చేరుకున్నారు. పార్టీ నినాదాలతో ప్రాంగణంలో సందడి నెలకొంది.






# సుస్థిర వృద్ధికి సంస్కరణలే ఇంధనం

ప్రపంచంలోనే శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ నేడు తన ప్రత్యేకతను చాటుకుంటోంది. డిజిటలీకరణకు తోడు మార్కెట్ సామర్థ్యాన్ని పెంచడం, పోటీతత్వాన్ని బలోపేతం చేయడం, ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించడం వంటి నిర్మాణాత్మక చర్యలు ఇందుకు దోహదపడ్డాయి. అధిక వృద్ధిని భవిష్యత్తులోనూ కొనసాగించడానికి ఆవిష్కరణలు, ఉత్పాదకత, కార్మిక మార్కెట్, న్యాయ పరిష్కారాలు, వస్తుసేవల పన్ను(జీఎస్టీ) వంటి రంగాల్లో రెండో తరం సంస్కరణలు అవసరం. ఇందుకోసం, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ మండలి ఎల్లుండి సమావేశం కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆర్థిక వ్యవస్థను సమర్థంగా, సమ్మిళిత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ఇండియా పలు నిర్మాణాత్మక చర్యలను చేపడుతూ వస్తోంది. ముఖ్యంగా జీఎస్టీ పేరుతో దేశమంతటా ఒకే పన్ను వ్యవస్థను తీసుకురావడం మార్కెట్ ఏకీకరణకు దోహదపడింది. ఆధార్, యూపీఐ, డిజిలాకర్ వంటి సదుపాయాల ద్వారా డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరించింది. సేవల పంపిణీ మరింత వేగంగా, పారదర్శకంగా మారింది. కార్పొరేట్ పన్ను తగ్గింపు, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలు దేశవిదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో కీలకమయ్యాయి. జాతీయ మౌలిక వసతుల పైప్‌లైన్, పీఎం గతిశక్తి, జాతీయ లాజిస్టిక్స్ విధానం వంటి కార్యక్రమాలు సరకు రవాణా, సరఫరా గొలుసుల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచాయి. అదే సమయంలో కస్టమ్స్ సంస్కరణలు, సులభతర వాణిజ్య విధానాలు భారతదేశాన్ని ప్రపంచ పెట్టుబడులకు అనుకూలమైన గమ్యస్థానంగా తీర్చిదిద్దాయి. జన్‌ధన్ యోజన, ప్రత్యక్ష నగదు బదిలీ, డిజిటల్ చెల్లింపుల ద్వారా కోట్ల మంది అధికారిక ఆర్థిక వ్యవస్థ పరిధిలోకి వచ్చారు.

**మదుపరుల్లో పెరిగిన నమ్మకం**

జీఎస్టీ కారణంగా ఏకీకృత జాతీయ మార్కెట్ ఏర్పడి, అంతర్రాష్ట్ర వాణిజ్యం సులభతరమైంది. దివాలా పరిష్కార చట్టం (ఐబీసీ)తో వ్యాపార సంస్థల ఆర్థిక క్రమశిక్షణ బలోపేతం కావడంతో పాటు ఆస్తుల పునర్వినియోగమూ సాధ్యమైంది. మరోవైపు బ్యాంకింగ్ వ్యవస్థలో క్రమశిక్షణ పెరిగి, దేశ ఆర్థిక స్థిరత్వం మరింతగా మెరుగుపడింది. వీటికి... వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతుల విస్తరణ, రవాణా వ్యయాల తగ్గుదల, ఉత్పత్తి సామర్థ్యం పెంపు వంటివి కూడా తోడయ్యాయి. దాంతో మదుపరుల్లో నమ్మకం బలపడి, పెట్టుబడుల ప్రవాహం ఊపందుకుంది. కానీ, ఇప్పటికీ అనేక సవాళ్లు అలాగే కొనసాగుతున్నాయి. శ్రామికశక్తిలో మహిళల భాగస్వామ్యం తక్కువగానే ఉంది. అసంఘటిత రంగం పెద్దదిగా ఉండటం, నైపుణ్యాల కొరత, వాణిజ్య వివాదాల పరిష్కారంలో జాప్యం, భూసేకరణ సమస్యలు, అధిక లాజిస్టిక్స్ వ్యయాలు, వ్యవసాయ మార్కెట్లలో విభజన, రాష్ట్రాలమధ్య నియంత్రణల భిన్నత్వం, ఆర్అండ్‌డీ రంగానికి పెట్టుబడుల కొరత వంటి సవాళ్లు తప్పడంలేదు. తదుపరి సంస్కరణలతో వీటిని పరిష్కరించగల వీలుంది.

దేశార్థిక వ్యవస్థ వేగం పుంజుకున్నప్పటికీ, 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించడానికి అధిక వృద్ధిరేటు ఒక్కటే సరిపోదు. మార్కెట్లు మరింత సమర్థంగా పనిచేయాలి, పెట్టుబడులు పెరగాలి, ఉత్పాదకత మెరుగుపడాలి. పైగా, వ్యాపార నిర్వహణ వ్యయం బాగా తగ్గాలి. ఇందుకోసం గడిచిన దశాబ్దంలో చేపట్టిన నిర్మాణాత్మక సంస్కరణలను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముంది. ఈ నేపథ్యంలో జీఎస్టీలో చేపట్టదలచిన 'తదుపరి తరం సంస్కరణలు' అత్యంత కీలకంగా మారాయి. 2017లో జీఎస్టీ రాకతో రాష్ట్రాల వారీగా ఉన్న అనేక పరోక్ష పన్నుల స్థానంలో దేశవ్యాప్తంగా ఒకే సమగ్ర పన్ను వ్యవస్థ ఏర్పడింది. అయితే, రెండోతరం సంస్కరణల ద్వారా దీన్ని మరింత సరళంగా, పారదర్శకంగా, పన్ను చెల్లింపుదారులకు అనుకూలంగా తీర్చిదిద్దాల్సి ఉంది. ఇందులో భాగంగా పన్ను రేట్ల హేతుబద్ధీకరణ, పన్ను అమలు సరళీకరణపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఇప్పటికే కొత్త రేట్లు అమలులోకి రావడం ఈ దిశలో ముఖ్యమైన అడుగు. పన్ను వ్యవస్థ ఎంత సరళంగా ఉంటే వ్యాపార సంస్థలకు అంతగా ఖర్చులు తగ్గుతాయి. దానివల్ల చిన్న, మధ్యతరహా సంస్థలు ఎక్కువగా లాభపడతాయి. పన్ను రేట్ల సరళీకరణ వల్ల వినియోగదారులకూ ఉపశమనం కలుగుతుంది, వ్యాపారాల విస్తరణకూ అవకాశం ఏర్పడుతుంది.

**కీలక ముందడుగు...**

జీఎస్టీ వ్యవస్థకు సంబంధించిన ఇటీవలి గణాంకాలు దాని విజయగాథను తెలియజేస్తున్నాయి. '2026 ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.12.46 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే ఇది 11.6శాతం అధికం. జూన్-సెప్టెంబర్ మధ్య రిఫండ్లను మినహాయించిన తర్వాత కూడా నికర వసూళ్లు 10.4శాతం పెరిగాయి' అని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. జీఎస్టీ రేట్ల మార్పుల తర్వాత బీ2సీ (వ్యాపారి నుంచి వినియోగదారులకు) అమ్మకాలు ఏకంగా 26.7శాతం పెరగడం వినియోగ డిమాండ్ బలపడటాన్ని సూచిస్తోంది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ సకాలంలో అందడమన్నది చిన్న వ్యాపారాల వర్కింగ్ క్యాపిటల్‌కు కీలకం. అలాగే ఏప్రిల్-సెప్టెంబర్ కాలంలో రూ.1.8 లక్షల కోట్ల రిఫండ్లు చెల్లించడం గమనార్హం. ఆగస్టు నాటికి జీఎస్టీ రిజిస్ట్రేషన్లు 1.7 కోట్లకు చేరాయి. అయితే రిఫండ్లు, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ), పన్ను వివాదాల పరిష్కారం మరింత వేగవంతం కావాలి. రెండో తరం జీఎస్టీ సంస్కరణలు కేవలం పన్ను సంస్కరణలు మాత్రమే కావు; సరళమైన పన్ను వ్యవస్థ ద్వారా పెట్టుబడి, వినియోగం, ఉపాధి, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసే కీలక ముందడుగులు! జీఎస్టీ వ్యవస్థ మరింత స్పష్టంగా, స్థిరంగా, పన్ను చెల్లింపుదారులకు అనుకూలంగా మారితే- సంస్థలు మరిన్ని పెట్టుబడులతో విస్తరించే అవకాశం ఉంటుంది. తద్వారా ఆర్థిక వృద్ధి, ఉపాధి, వినియోగం, పెట్టుబడులు, ప్రభుత్వ ఆదాయాలు పరస్పరం బలపడతాయి. అందుకే, భారత్ తన ప్రస్తుత ఆర్థిక వృద్ధిని భవిష్యత్తులోనూ కొనసాగించడానికి జీఎస్టీలో రెండో తరం సంస్కరణలు అత్యవసరమవుతున్నాయి.

# భారత ఇంధన భద్రతకు కొత్త భరోసా

భారతదేశ చమురు అవసరాల్లో సుమారు 90శాతం, సహజ వాయువు అవసరాల్లో 55శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఇరాన్ యుద్ధం... పశ్చిమాసియాలో భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయంగా చమురు, ద్రవరూప సహజవాయువు(ఎల్ఎన్‌జీ), వంట గ్యాస్(ఎల్‌పీజీ) సరఫరా వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. దాంతో మన దేశంలోనూ ఇంధన కొరత ఏర్పడుతోంది. కాబట్టి, భారత్ తన సహజ వనరులను అధునాతన సాంకేతికతలతో అనుసంధానించి ఇంధనాలు, వంట గ్యాస్, ఎరువులు, రసాయనాలు, పారిశ్రామిక ముడి సరకుల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అత్యావశ్యకంగా మారింది. కోల్ గ్యాసిఫికేషన్ టెక్నాలజీతో ఇది సాధ్యపడుతుంది.దేశంలో అపారంగా ఉన్న బొగ్గు వనరులను స్వచ్ఛమైన ఇంధనంగా మార్చడానికీ, పారిశ్రామిక విలువను ఆపాదించడానికీ కోల్ గ్యాసిఫికేషన్ టెక్నాలజీ దోహదపడుతుంది. సాధారణంగా బొగ్గు నుంచి ఇంధనం ఉష్ణరూపంలో లభిస్తుంది. కానీ, గ్యాసిఫికేషన్ ప్రక్రియ ద్వారా బొగ్గు నుంచి కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్ మిశ్రమమైన సింథసిస్ గ్యాస్(సిన్‌గ్యాస్)ను ఉత్పత్తి చేయవచ్చు. తర్వాత ఈ వాయువును శుద్ధిచేసి, మన అవసరాలకు తగ్గట్లు దాని రసాయన కూర్పును మార్చుకోవచ్చు, విలువైన ఉత్పత్తులను తయారు చేయవచ్చు. ముఖ్యంగా సింథసిస్ గ్యాస్ నుంచి హైడ్రోజన్‌ను వేరుచేసి సంబంధిత పరిశ్రమల్లో ఉపయోగించవచ్చు. అలాగే హైడ్రోజన్‌ను నైట్రోజన్‌తో కలిపి అమ్మోనియా, యూరియా వంటి ఎరువులను ఉత్పత్తి చేయవచ్చు. సిన్‌గ్యాస్ నుంచి మెథనాల్, సింథటిక్ ఇంధనాలూ తయారవుతాయి.



**మిథనేషన్ ప్రక్రియ ద్వారా సింథసిస్ గ్యాస్‌ను కృత్రిమ సహజ వాయువు(ఎస్ఎన్‌జీ) లేదా డైమిథైల్ ఈథర్(డీఎంఈ)గా మార్చి వంట గ్యాస్‌గా వినియోగించవచ్చు.**

**విదేశాల్లో విజయవంతంగా...**

ప్రపంచంలో ఎక్కువ బొగ్గు నిల్వలు ఉన్న అయిదో అతిపెద్ద దేశం మనది. భారత్‌లో సుమారు 40వేల కోట్ల టన్నులకు పైగా బొగ్గు వనరులు ఉన్నాయి. కానీ, సాంప్రదాయ తవ్వకాల ద్వారా వెలికితీయడం సాధ్యం కానంతగా... 400 మీటర్లకు పైగా లోతులో సుమారు 1015 వేల కోట్ల టన్నుల మేర నిల్వలు పోగుపడ్డాయి. వీటిని సద్వినియోగం చేసుకునేలా సింథసిస్ గ్యాస్‌గా మార్చడానికి 'అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్(యూసీజీ)' విధానం దోహదపడుతుంది. దీన్ని విజయవంతంగా చేపట్టగలిగితే, భారతదేశాన్ని ఇంధన రంగంలో స్వయంసమృద్ధి వైపు తీసుకెళ్లవచ్చు. తద్వారా పారిశ్రామిక ప్రగతి మరింతగా ఊపందుకుంటుంది.

అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్‌కు సుదీర్ఘ చరిత్ర, వాణిజ్య అనుభవం ఉంది. ఒకప్పటి సోవియట్ యూనియన్ 1960 దశకం నుంచే పెద్దయెత్తున యూసీజీ ప్లాంట్లను నిర్వహించి... పరిశ్రమలు, విద్యుత్ అవసరాల కోసం సింథసిస్ గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తూ వచ్చింది. 1980లలో అత్యంత భారీ గ్యాస్ నిల్వలను కనుగొనే వరకు ఇవి విజయవంతంగా నడిచాయి. ఉజ్బెకిస్థాన్‌లో 1961లో ప్రారంభమైన యూసీజీ వాణిజ్య ఉత్పత్తి ఇప్పటికీ కొనసాగుతోంది. చైనా సైతం 1980లలో దీన్ని విజయవంతంగా అభివృద్ధి చేసింది. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన పర్యావరణ, భద్రతా నిబంధనలు ఉన్న ఆస్ట్రేలియాలో 2018 వరకు యూసీజీ ప్రాజెక్టులు విజయవంతంగా అమలయ్యాయి. పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా, సురక్షితంగా ఈ సాంకేతికతను ఉపయోగించవచ్చని ఆస్ట్రేలియా నిరూపించింది. అలాగే దక్షిణాఫ్రికాలోని సాసోల్ సెకుండా ప్రాజెక్టులో బొగ్గును సింథసిస్ గ్యాస్‌గా మార్చి... ఫిషర్‌ట్రోప్ష్ టెక్నాలజీ సాయంతో సింథటిక్ ఇంధనాలు, రసాయనాలను ఉత్పత్తి చేస్తున్నారు. ఆధునిక డ్రిల్లింగ్, వెల్ డిజైన్, ఒత్తిడి నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణ వ్యవస్థల్లో వచ్చిన అధునాతన పద్ధతులతో నేడు అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్ సాంకేతికత మరింత సమర్థంగా, సురక్షితంగా అభివృద్ధి చెందింది. ఈ క్రమంలోనే, ఒడిశాలోని తాల్చేర్ బొగ్గు గ్యాసిఫికేషన్ ఆధారిత ఎరువుల ప్రాజెక్టు రోజూ 2,200 టన్నుల అమ్మోనియా, 3,850 టన్నుల యూరియా ఉత్పత్తి సామర్థ్యంతో రూపుదిద్దుకుంటోంది. దేశీయ బొగ్గును ఎరువుల ఉత్పత్తితో అనుసంధానించే పారిశ్రామిక నమూనాగా ఇది నిలుస్తోంది.

**వడివడిగా లక్ష్య సాధన దిశగా...**

దేశంలో బొగ్గు వనరులు విస్తారంగా ఉన్నాయి. మరోవైపు ఎరువులు, రసాయనాలు, హైడ్రోజన్, మిథనాల్, పారిశ్రామిక వాయువులు వంటి రంగాల్లో ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించుకోవాల్సిన అవసరముంది. యూసీజీ వంటి గ్యాసిఫికేషన్ సాంకేతికతలు ఈ రెండింటినీ సమర్థంగా అనుసంధానించగలవు. 'నేషనల్ కోల్ గ్యాసిఫికేషన్ మిషన్' కింద 2030 నాటికి పది కోట్ల టన్నుల బొగ్గును గ్యాసిఫికేషన్ చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. జిందాల్ స్టీల్, తాల్చేర్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ వంటి ప్రాజెక్టుల ద్వారా ఇప్పటికే ఏటా సుమారు 2.26 కోట్ల టన్నుల బొగ్గు నిల్వల గ్యాసిఫికేషన్ కార్యకలాపాలు అమలు దశలో ఉన్నాయి. ఈ సామర్థ్యాన్ని మరింతగా విస్తరించడం కోసం కేంద్రం తాజాగా రూ.37,500 కోట్లతో కొత్త ఉపరితల బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించే ప్రత్యేక పథకానికి ఆమోదం తెలిపింది. తద్వారా ఏటా సుమారు 7.5కోట్ల టన్నుల బొగ్గును గ్యాసిఫికేషన్‌కు వినియోగించే వీలుంటుంది.

**పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు**

బొగ్గు బ్లాక్ వేలం 14వ రౌండ్‌లో కేంద్రం మొదటిసారిగా అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్ బ్లాకులను వేలానికి అందుబాటులో ఉంచింది. ఈ క్రమంలోనే రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఏపీలో రెండు బ్లాకులను దక్కించుకుంది. వాటిలో ఒకటి సుమారు 12 చదరపు కిలోమీటర్ల వైశాల్యం కలిగిన చింతలపూడి సెక్టార్ ఏ1 బ్లాక్; మరొకటి 22 చదరపు కిలోమీటర్ల వైశాల్యం ఉన్న రేచర్ల బ్లాక్. ఈ కేటాయింపులతో కోల్ గ్యాసిఫికేషన్ రంగంలో ముందంజ వేయడానికి ఆంధ్రప్రదేశ్‌కు గొప్ప అవకాశం దక్కింది. అయితే, ఏపీలో బొగ్గు గ్యాసిఫికేషన్ కార్యక్రమాన్ని ఒకే ఉత్పత్తి కేంద్రంగా కాకుండా 'బొగ్గుఆధారిత సమగ్ర పారిశ్రామిక కేంద్రం (కోల్‌టువాల్యూ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ హబ్)'గా అభివృద్ధి చేయడం ఒక ముందుచూపుతో కూడిన ఆలోచనగా ఉంటుంది. ఇలాంటి నమూనాలో సింథసిస్ గ్యాస్ నుంచి ఉత్పత్తి అయ్యే హైడ్రోజన్, అమ్మోనియా, మెథనాల్ రసాయనాలు, ఎరువులు, అనుబంధ పరిశ్రమలకు ముడిపదార్థాలుగా మారతాయి. మరోవైపు, ఉత్పత్తి అయ్యే కృత్రిమ సహజ వాయువును పట్టణ పైప్‌లైన్ నెట్‌వర్క్ ద్వారా ఇళ్లకు వంట గ్యాస్‌గా సరఫరా చేయవచ్చు.

ప్రధాన గ్యాసిఫికేషన్ యూనిట్ చుట్టూ ఎరువులు, రసాయనాలు, పారిశ్రామిక వాయువులు, ఇంజినీరింగ్, నిల్వ, రవాణా, ప్యాకేజింగ్, నిర్వహణ వంటి అనుబంధ పరిశ్రమలతో కూడిన సమగ్ర వ్యవస్థ ఏర్పడుతుంది. రాష్ట్రంలోని సుదీర్ఘ సముద్రతీరం, పోర్టులు, రైల్వేలు, జాతీయ రహదారులు, విద్యుత్ మౌలిక వసతులు, పారిశ్రామిక ప్రాంతాలను ఈ విలువ శ్రేణితో అనుసంధానించవచ్చు. అంతేకాదు, ఈ ప్రాజెక్టు ద్వారా రసాయన, విద్యుత్, పరికరాల రూపకల్పన, భూగర్భశాస్త్రం, పర్యావరణ శాస్త్రం, ప్లాంట్ నిర్వహణ వంటి రంగాల్లో పెద్దయెత్తున నైపుణ్య ఆధారిత ఉపాధి అవకాశాలు అందివస్తాయి. కాబట్టి, అందుకు అవసరమైన నైపుణ్యాలను స్థానిక యువతకు మప్పేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్నీ; సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం అనుబంధ పారిశ్రామిక పార్కునూ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. మరోవైపు పరిశోధనఅభివృద్ధి కేంద్రం, అధునాతన విశ్లేషణాత్మక ప్రయోగశాల, ప్రాసెస్ టెక్నాలజీ కేంద్రాలను పారిశ్రామిక సముదాయంలో భాగం చేయడం ద్వారా విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు కలిసి పనిచేసే అవకాశం ఉంటుంది. అయితే, ప్రాజెక్టు ప్రారంభానికి ముందు ప్రాథమిక జలభూరసాయన సర్వే చేపట్టడంతో పాటు భూగర్భజలాలు, నేల నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తుండాలి. ఏదిఏమైనా కేంద్ర ప్రభుత్వ విధానాలు, రాష్ట్రానికి అందివచ్చిన ప్రాజెక్టులు... ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతిలో కొత్త శకానికి నాంది పలకనున్నాయనే చెప్పాలి!

# పుస్తకాల బైండర్ నుంచి శాస్త్రవేత్తగా..

ఒకసారి ప్రఖ్యాత శాస్త్రవేత్త హంఫ్రీ డేవీని 'మీ ఆవిష్కరణల్లో అత్యుత్తమమైనది ఏది?' అని ఎవరో అడిగితే- 'మైకేల్ ఫారడే' అని జవాబిచ్చారట ఆయన. గురువు నుంచి అంతకన్నా గొప్ప ప్రశంస శిష్యుడికి ఏముంటుంది?భౌతిక, రసాయన శాస్త్రవేత్తగా సుప్రసిద్ధుడైన మైకేల్ ఫారడే 1791లో ఇంగ్లాండ్‌లోని సాధారణ పేద కుటుంబంలో జన్మించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. కుటుంబానికి సాయంగా ఉండటానికి పద్నాలుగేళ్లకే పుస్తకాల బైండింగ్ దుకాణంలో పనికి కుదిరారు. ఫారడే కేవలం బడికెళ్లడం మానేశారు కానీ, చదువుకోవాలనే తపన ఆయనలో ఏమాత్రం తగ్గలేదు. బైండింగ్ కోసం వచ్చిన పుస్తకాల్లో సైన్స్‌కు సంబంధించినవి ఏవైనా ఉంటే, రాత్రంతా కూర్చుని చదివేసేవారు. అలా సైన్స్ మీద ఆసక్తి పెంచుకున్నారు. వీలైనప్పుడు శాస్త్రవేత్తల ప్రసంగాలు వినేవారు. ఆ క్రమంలో బ్రిటన్‌లో అప్పటికే పేరున్న శాస్త్రవేత్త హంఫ్రీ డేవీ ఉపన్యాసాలూ విన్నారు. అంతేకాకుండా అవన్నీ నోట్స్‌గా రాసి, 300 పేజీల పుస్తకాన్ని అందంగా బైండింగ్ చేసి డేవీకి పంపారు. దాంతోపాటు తన ప్రయోగశాలలో ఏదైనా ఉద్యోగం ఇవ్వమని కోరారు. కేవలం ప్రసంగాలు విని అంత బాగా నోట్స్ రాసినందుకు ఫారడే ప్రతిభకు ముగ్ధుడైన డేవీ.. రాయల్ ఇన్‌స్టిట్యూషన్‌లో సహాయకుడిగా నియమించారు. ఆ రోజు డేవీ తీసుకున్న నిర్ణయం విజ్ఞానశాస్త్ర చరిత్రనే మార్చేసింది.

ఎనిమిదేళ్లపాటు డేవీ దగ్గర సహాయకుడిగా పనిచేశారు ఫారడే. ఆ సమయంలో ఇద్దరూ కలిసి పలు ప్రయోగాలు చేయడమే కాదు, యూరప్ అంతా పర్యటించారు. పలువురు సైంటిస్టులను కలిశారు. అయోడిన్ రీసెర్చ్, క్లోరిన్ గ్యాస్‌ని విజయవంతంగా ద్రవీకరించడం, వజ్రం స్వచ్ఛమైన కార్బన్ రూపమని నిరూపించడం... లాంటి ప్రయోగాలెన్నో చేశారు. 1820 తర్వాత స్వతంత్ర పరిశోధకుడిగా ఎదిగారు ఫారడే. 1831లో విద్యుదయస్కాంత ప్రేరణను కనుగొన్నారు. అయస్కాంత క్షేత్రంలో మార్పుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని నిరూపించారు. ఈ ఆవిష్కరణ ఆధునిక జనరేటర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల అభివృద్ధికి పునాది అయింది. ఒకసారి హైడ్రోజన్ గ్యాస్ మీద ప్రయోగాలు చేస్తున్నప్పుడు, రబ్బరు షీట్లను అతికించి గ్యాస్‌ను నిల్వ చేయడానికి ప్రయత్నించారట. అక్కడి నుంచే రబ్బర్ బెలూన్లు పుట్టాయి.

ఇలా ఒకానొక దశలో గురువును మించిన శిష్యుడు అనిపించుకున్నారు ఫారడే. తన సేవలకు గుర్తింపుగా బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చిన 'నైట్‌హుడ్' బిరుదును మాత్రం ఆయన స్వీకరించలేదు. రాయల్ సొసైటీ అధ్యక్ష పదవిని రెండుసార్లు తిరస్కరించి... పరిశోధనల్లో మునిగిపోయారు. తన పరిశోధనలను పుస్తకాలుగా ప్రచురిస్తామని ప్రచురణకర్తలు ముందుకొచ్చినా అంగీకరించలేదు. 'నాకు డబ్బు కన్నా సైన్స్ అంటేనే ఎక్కువ ఇష్టం. ఆ ఇష్టాన్నే వృత్తిగా మలచుకున్నాను కాబట్టి ధనవంతుణ్ని కాలేను' అన్న ఫారడే చివరివరకూ సామాన్యుడిలా జీవించారు తప్ప ప్రపంచాన్ని మార్చే పరిశోధనలకు కారణమైన గొప్ప శాస్త్రవేత్తననే భావనే ఉండేది కాదు. 'స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఉన్న షేర్లన్నిటి విలువ కలిపితే ఎంతుంటుందో అంతకన్నా ఎక్కువ విలువైన ఆవిష్కరణలు చేసిన మహనీయుడు ఫారడే' అని వ్యాఖ్యానించారు మార్గరెట్ థాచర్ ఒక సందర్భంలో.

# ఎండ–ఎకానమీ



ప్రపంచంలోని అత్యంత వేడిగా ఉన్న 50 నగరాల్లో 26 భారత్‌లోనే ఉన్నాయని క్లైమేట్ సెంట్రల్ అధ్యయనం వెల్లడించింది. మే 21న దేశ విద్యుత్ డిమాండ్ 270.82 గిగావాట్లకు చేరి కొత్త రికార్డు నెలకొల్పింది. ఇవి కేవలం వాతావరణ గణాంకాలు మాత్రమే కాదు... నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు, డెలివరీ రైడర్లు, ఆటో డ్రైవర్లు, వీధి వ్యాపారులు, పారిశుద్ధ్య కార్మికులు వంటి కోట్లాది మంది జీవనోపాధిపై ప్రత్యక్ష ప్రభావం చూపే ఆర్థిక సంకేతాలు.ఇంతకాలం ఎండ తీవ్రతను వాతావరణ శాఖ హెచ్చరికగా, ఆరోగ్య శాఖ సమస్యగానే చూశాం. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) దృష్టిలో మాత్రం ఇది ఆర్థిక వ్యవస్థను కుదిపేసే అంశం. భారత శ్రామిక శక్తిలో సుమారు 75 శాతం మంది... వేడి ప్రభావానికి గురయ్యే వృత్తుల్లోనే ఉన్నారు.

2030 నాటికి ఉత్పాదకత తగ్గుదల కారణంగా 3.4 కోట్ల ఉద్యోగాలకు సమానమైన శ్రామిక సామర్థ్యం కోల్పోవచ్చని ఐఎల్ఓ అంచనా వేస్తోంది. ప్రపంచ బ్యాంకు మాత్రం భారత జీడీపీలో 4.5 శాతం (సుమారు 150-250 బిలియన్ డాలర్లు) 2030 నాటికి ప్రమాదంలో పడొచ్చని హెచ్చరిస్తోంది.

తీవ్రమైన వేసవి రోజుల్లో అసంఘటిత కార్మికులు తమ ఆదాయంలో 40 శాతం వరకు కోల్పోతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు ఏటా 24 పని దినాలను కోల్పోతున్నారు. ఇది ఒక్కసారి జరిగిపోయేది కాదు. ప్రతి ఏటా పునరావృతమయ్యే, నిశ్శబ్దంగా పేదరికాన్ని మరింత లోతు చేసే ప్రక్రియ. దేశంలో ఒక్క తీవ్రమైన ఎండ రోజునే సుమారు 3,400 అదనపు మరణాలు సంభవిస్తున్నాయని 2026 అధ్యయనం అంచనా వేసింది. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ - ఈ అయిదు రాష్ట్రాల్లో దేశ జనాభాలో 43 శాతం ఉండగా, వడగాల్పు మరణాల్లో 60 శాతానికి పైగా ఇక్కడే నమోదవుతున్నాయి. ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాలే ఎండ భారాన్ని ఎక్కువగా మోస్తున్నాయనేది ఇక్కడ కనిపించే లోతైన అసమానత.

తెలంగాణ ప్రభుత్వం వడగాల్పును 'రాష్ట్ర ప్రత్యేక విపత్తు'గా ప్రకటించి మృతుల కుటుంబాలకు పరిహారాన్ని రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షలకు పెంచింది. తెలంగాణ కార్మిక సంఘాల ప్రకారం... ప్రభుత్వ ప్రణాళికలు, పథకాలు స్థానిక భాషల్లో కార్మికులకు చేరడం లేదు. నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు ఇప్పటికీ తగిన రక్షణ లేకుండానే పనిచేస్తున్నారు. ఆహార పంపిణీ కార్మికులు, ద్విచక్ర వాహన రైడర్ల ఆదాయం రోడ్డుపై గడిపే గంటలపైనే ఆధారపడి ఉంటుంది. వీరికి కనీస వేతన హామీ లేదు, సామాజిక భద్రతా రక్షణ ఇంకా పరిమితంగానే ఉంది.3

**ఒక విధాన ప్రశ్న**

పరిష్కారం 'నీళ్లు తాగండి, నీడలో ఉండండి' అనే హెచ్చరికలకే పరిమితం కాకూడదు. ఇది శ్రామిక విధానానికి సంబంధించిన ప్రశ్న. మధ్యాహ్నం 12-3 గంటల మధ్య బహిరంగ నిర్మాణ పనులను నిషేధించే చట్టం - ఖతార్, యూఏఈ వంటి దేశాలు అమలు చేస్తున్నాయి. భారత్‌లోనూ తీసుకురావాలి. ప్రతి నిర్మాణ సైట్‌లో నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను తప్పనిసరి చేయాలి. 45 డిగ్రీలు దాటిన రోజుల్లో కార్మికుల ఆదాయ నష్టానికి ప్రభుత్వమే బీమా లేదా పరిహార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలతో సమన్వయంతో ఎండ తీవ్రతను వాతావరణ హెచ్చరికగా మాత్రమే కాకుండా, జాతీయ ఆర్థిక ప్రణాళికలో కీలక ప్రమాద అంశంగా పరిగణించడం అత్యవసరం. థర్మామీటర్‌లో వేడి పెరిగిన కొద్దీ పేదరికం పెరుగుతోంది. ఈ ఎండ నిశ్శబ్దంగా భారత్ ఆర్థిక పునాదిని కరిగిస్తోంది. ప్రతి సంవత్సరం పునరావృతమయ్యే ఈ సంక్షోభాన్ని ఇక వాతావరణ వార్తగా కాకుండా, జాతీయ ప్రాధాన్యతగా గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.

## దుండిగల్ రైతుల భూ సమస్యకు
# పరిష్కారం చూపాలి

- ల్యాండ్ పూలింగ్‌పై స్పష్టత ఇవ్వాలని మంత్రి పొంగులేటికి వినతి
- మూడు నెలలుగా గ్రామసభలు నిర్వహించినా ముందుకు సాగని ప్రక్రియ
- మంత్రిని కలిసిన ప్రోటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, రైతులు



**దుండిగల్, అక్టోబర్ 24 (సిటీటైమ్స్):**

దుండిగల్ రైతుల భూ సమస్యకు పరిష్కారం చూపాలని, అసైన్డ్ భూముల ల్యాండ్ పూలింగ్ ప్రక్రియపై నెలకొన్న సందిగ్ధతను తొలగించాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని రైతులు కోరారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ గ్రామ సర్వే నంబర్లు 453, 454లో ఉన్న అసైన్డ్ భూముల ల్యాండ్ పూలింగ్ అంశంపై స్పష్టత కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రోటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి, దుందిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ ఆధ్వర్యంలో రైతులు శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

గత మూడు నెలలుగా రెవెన్యూ అధికారులు ల్యాండ్ పూలింగ్ అంశంపై రైతులతో గ్రామసభలు నిర్వహించినప్పటికీ, తదుపరి ప్రక్రియకు సంబంధించి ఎలాంటి స్పష్టమైన సమాచారం అందలేదని రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. భూముల విషయంలో ప్రభుత్వ నిర్ణయం ఏమిటి? ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ ఏ దశలో ఉంది? తదుపరి చర్యలు ఎలా ఉండబోతున్నాయి? అనే అంశాలపై రైతుల్లో సందేహాలు నెలకొన్నాయని వివరించారు. సంబంధిత రెవెన్యూ అధికారుల ద్వారా సమగ్ర సమాచారం అందించి, రైతుల సందేహాలను నివృత్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

రైతుల భూములకు సంబంధించిన అంశం కావడంతో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో పారదర్శకత పాటించాల్సిన అవసరం ఉందని ప్రతినిధులు కోరారు. గ్రామసభల నిర్వహణతోనే సరిపెట్టకుండా తదుపరి చర్యలపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. భూ సమస్యకు సంబంధించి రైతుల్లో నెలకొన్న అనిశ్చితిని తొలగించేలా చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు.

ఈ కార్యక్రమంలో రైతులు బొమ్మల అశోక్ ముదిరాజ్, పండుగ శ్రీశైలం ముదిరాజ్, దొంతి మహేష్ ముదిరాజ్, బిక్షపతి, కావలి శంకరయ్య, చెలకల అశోక్, చంద్రయ్య, జక్కుల కృష్ణ యాదవ్, సిరగల స్వామి తదితరులు పాల్గొన్నారు. భూముల ల్యాండ్ పూలింగ్‌పై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాన్ని వెల్లడించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

# నాణ్యతతో ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి చేయాలి





- మంత్రి వాకిటి శ్రీహరి
- ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- రూ.28 కోట్లతో 50 పడకల ఆసుపత్రి నిర్మాణం

**ఆత్మకూరు సిటీ టైమ్స్ అక్టోబరు 24**

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలో రూ.28 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి పనులను శనివారం ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతంగా చేపడుతూ, నాణ్యతా ప్రమాణాల్లో ఎలాంటి రాజీ పడకుండా నిర్ణీత ప్రమాణాల ప్రకారం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

**స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు**

ఆత్మకూరు పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణానికి ప్రాధాన్యమిస్తోంది. ఆధునిక వైద్య సదుపాయాలతో 50 పడకల ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం అత్యవసర వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్న ప్రజలకు కొత్త ఆసుపత్రి అందుబాటులోకి రావడం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. స్థానికంగానే వైద్య సేవలు పొందే అవకాశం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

**నాణ్యతలో రాజీ వద్దు**

ఆసుపత్రి నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. నిర్మాణంలో ఉపయోగించే సామగ్రి నాణ్యతతో పాటు పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజాధనంతో చేపడుతున్న అభివృద్ధి పనులు ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. పనుల్లో అనవసర జాప్యం జరగకుండా సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశించారు.



**ప్రజారోగ్యానికి ప్రభుత్వ ప్రాధాన్యం**

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ మెరుగైన వైద్య మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆసుపత్రుల అభివృద్ధి ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువవుతాయని పేర్కొన్నారు. ఆత్మకూరులో నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి పనులను నాణ్యతతో పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు మంత్రి సూచించారు.

## పౌర సేవల్లో ...
# జవాబుదారీతనం పెరగాలి

- కమిషనర్ సృజన
- 'బిల్డ్ నౌ' దరఖాస్తులు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు
- పార్కులు, జంక్షన్లు, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలి
- పారిశుధ్యం, దోమల నియంత్రణ, స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రత్యేక దృష్టి

**గచ్చిబౌలి, అక్టోబరు 24 (సిటీటైమ్స్):**

ప్రజలకు అందించే పౌర సేవల్లో పారదర్శకత పెంచడంతోపాటు ప్రతి పనికీ అధికారులు జవాబుదారీగా వ్యవహరించాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ గుమ్మల్ల సృజన, ఐఏఎస్ స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని వివిధ విభాగాల పనితీరు, పెండింగ్ సమస్యలు, కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రతిపాదిత ప్రాజెక్టులపై శనివారం నిర్వహించిన సమగ్ర సమీక్షలో అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.

**ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు**

టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరును సమీక్షిస్తూ ప్రజా ఫిర్యాదులు, 'బిల్డ్ నౌ' దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు పాదచారులకు ఇబ్బందులు లేకుండా 'వాక్ ఫ్రీ' కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలన్నారు. పెండింగ్ కోర్టు కేసుల విషయంలో స్టాండింగ్ కౌన్సిల్‌తో సమన్వయం చేసుకుంటూ తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు.



ఇంజినీరింగ్ విభాగం పరిధిలో మంజూరైన పార్కులు, ప్రధాన కూడళ్ల అభివృద్ధి, ఫుట్‌పాత్‌లు, వీధి దీపాల నిర్వహణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల్లో జాప్యం, నాణ్యతా లోపాలు ఉంటే సహించబోమని హెచ్చరించారు. పట్టణ పేదరిక నిర్మూలన, సమాజ అభివృద్ధి విభాగం (యూసీడీ) ద్వారా కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, బ్యాంకు రుణాల అనుసంధానం, పీఎం స్వనిధి పథకం అమలును వేగవంతం చేయాలన్నారు. నగర జీవవైవిధ్యాన్ని పెంపొందించడం, మున్సిపల్ ఆస్తులను పరిరక్షించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, చీఫ్ ఇంజినీర్, చీఫ్ సిటీ ప్లానర్ వెంకన్న, విజిలెన్స్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

**పారిశుధ్యం, ప్రజారోగ్యంపై నిరంతర పర్యవేక్షణ**

పారిశుధ్య నిర్వహణలో భాగంగా కార్మికుల హాజరు, చెత్త తరలింపు వాహనాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. 'నో బిన్–నో ట్రేడ్' కార్యక్రమం, పోస్టర్ రహిత నగర ప్రచారం, నిర్మాణ వ్యర్థాల (సీ అండ్ డీ వేస్ట్) సేకరణ, తరలింపును స్వచ్ఛ సర్వేక్షణ్ లక్ష్యాలకు అనుగుణంగా చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు దోమల నివారణ మందుల పిచికారీ సహా ప్రజారోగ్య చర్యలను ముమ్మరం చేయాలని సూచించారు. చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపునకు అవసరమైన వాహనాలను సమకూర్చుకోవాలని రవాణా విభాగానికి ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.

## శ్రీ ఎల్లమ్మ తల్లి నిర్మాణానికి 100 బ్యాగుల సిమెంట్ విరాళం



- బీజేపీ సీనియర్ నాయకులు రామన్నగారి శ్రీనివాస్ గౌడ్ ఔదార్యం

**మేడ్చల్ (సిటీ టైమ్స్) అక్టోబర్ 24**

మేడ్చల్ సర్కిల్ పరిధి పూడూరుకిష్టాపూర్ డివిజన్ కిష్టాపూర్ నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ఎల్లమ్మ ఆలయా నిర్మాణానికి బీజేపీ సీనియర్ నాయకులు రామన్నగారి శ్రీనివాస్ గౌడ్ తన సొంత నిధులతో 100 బ్యాగుల సిమెంట్‌ను విరాళంగా అందజేశారు.దేవాలయ నిర్మాణానికి సహకరించాలంటూ కిష్టాపూర్ ప్రజలు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరిన నేపథ్యంలో,తన వంతు సహాయంగా శ్రీనివాస్ గౌడ్ ఈ విరాళాన్ని అందించారు.ఆలయ నిర్మాణ కమిటీ సభ్యురాలు రాములమ్మకు 100 బ్యాగుల సిమెంట్ ఖర్చులకు అయ్యే డబ్బులను అందజేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..సమాజ అభివృద్ధిలో గుడి,బడి ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.దేవాలయాలు ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తే,పాఠశాలలు విద్య ద్వారా ప్రజల ఎదుగుదలకు బాటలు వేస్తాయని పేర్కొన్నారు. శ్రీ ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి సిమెంట్ విరాళంగా అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. దేవాలయ నిర్మాణానికి సహకరించిన రామన్నగారి శ్రీనివాస్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్,రతన్ రాథోడ్, గోపు నాగరాజు,ఒగ్గు భాస్కర్,అభినవ్ గౌడ్,చారీ,దొడ్ల మోహన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం!



- బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి మైబుస్‌కు అఖిలపక్ష ఐక్యవేదిక నాయకుల పరామర్శ...

**వనపర్తి, అక్టోబర్ 24 (సిటీటైమ్స్):**

ఇటీవల అస్వస్థతకు గురై కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందిన బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి మండ్ల మైబుస్‌ను అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు శనివారం పరామర్శించారు.గోపాల్‌పేట మండలం బుద్ధారం గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా అఖిలపక్ష ఐక్యవేదిక నాయకుడు డాక్టర్ సతీష్ యాదవ్ మాట్లాడుతూ మైబుస్‌కు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ జిల్లెల్ల వరప్రసాద్‌తో అపాయింట్‌మెంట్ తీసుకుని త్వరలో వైద్య పరీక్షలు చేయిస్తామని తెలిపారు. మైబుస్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకునే వరకు అవసరమైన వైద్య సహాయం అందించడంలో అఖిలపక్ష ఐక్యవేదిక అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, కొత్తగుళ్ల శంకర్, రాజ్‌కుమార్, రాజనగరం రవి, రామస్వామి, శివకుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం మరమ్మతులకు
# చర్యలు చేపట్టాలి

- సైదోనిగడ్డ తాండ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన విద్యాశాఖ సూపర్‌వైజర్ సుష్మలత

**మేడ్చల్ (సిటీ టైమ్స్),అక్టోబర్ 24:**

ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని సైదోనిగడ్డ తండాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని విద్యాశాఖ సూపర్‌వైజర్ సుష్మలత,మున్సిపల్ చైర్‌పర్సన్ లావుడ్యా శ్రీదేవి రమేష్‌తో కలిసి శనివారం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన మరమ్మతు పనులను గుర్తించి, చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో ఈ పరిశీలన చేపట్టినట్లు తెలిపారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని ప్రస్తుత పరిస్థితులను, భవనానికి అవసరమైన మరమ్మతు పనులను పరిశీలించారు.చిన్నారులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధనతో పాటు పోషకాహార సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి,భవనానికి అవసరమైన మరమ్మతులు చేపట్టడం ద్వారా చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వివరించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అంగన్‌వాడీ సిబ్బంది,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# గ్రామాల వారీగా అభివృద్ధిపై మంత్రి సమీక్ష




- ప్రతి గ్రామానికి 20 నిమిషాల సమయం.. సమస్యలపై ఆరా

**ఆత్మకూరు సిటీ టైమ్స్ అక్టోబర్ 24**

మక్తల్ నియోజకవర్గంలోని ఆత్మకూరు మండల గ్రామాల సమగ్ర అభివృద్ధికి మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఇందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులతో గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి, ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అవసరమైన మౌలిక వసతులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్షించారు.

ప్రతి గ్రామానికి ప్రత్యేకంగా 20 నిమిషాలు కేటాయించి..

మండలంలోని ప్రతి గ్రామానికి ప్రత్యేకంగా 20 నిమిషాల సమయం కేటాయించి, గ్రామాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాల అవసరాలతో పాటు ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలను ప్రజాప్రతినిధుల ద్వారా తెలుసుకున్నారు. గ్రామాల ప్రాధాన్యతలను గుర్తించి, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు ఈ సమావేశాలు నిర్వహించారు.



### సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు

**గ్రామాల్లో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగడమే ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు గ్రామాల సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు సమష్టి కృషి అవసరమని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.**

# ప్రజల సంక్షేమానికి రేషన్ కార్డులు కీలకం



- బండ్లగూడలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించాలి: గండి యాదగిరి గౌడ్

**దమ్మాయిగూడ, అక్టోబర్ 24(సిటీ టైమ్స్):**

ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరినప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుందని బండ్లగూడ మాజీ సర్పంచ్ గండి యాదగిరి గౌడ్ అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.కీసర సర్కిల్ పరిధిలోని దమ్మాయిగూడ డివిజన్ బండ్లగూడలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గండి యాదగిరి గౌడ్ మాట్లాడుతూ, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు పొందడంతో పాటు, అర్హతను బట్టి వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు రేషన్ కార్డులు కీలకంగా ఉపయోగపడతాయని తెలిపారు.స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సేవలు మరింత సులభతరమవుతాయని, లబ్ధిదారులకు పారదర్శకంగా సేవలు అందించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోవింద్ సింగ్, భూపతి రెడ్డి, మహిళా నాయకురాలు రజిత, యువ నాయకులు కిషన్ ప్రసాద్, బజరంగ్, రాజ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి






- ఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి
- తాగునీటి సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలి
- రైతులకు అవగాహన కల్పించాలి.. పశుపక్షాదులను కాపాడుకోవాలి

**ఆత్మకూరు సిటీ టైమ్స్ అక్టోబరు 24**

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతపై సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర క్రీడలు, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శనివారం ఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

రాబోయే ఎనిమిది నెలలు అత్యంత కీలకమని, ఈ సమయంలో నీటి సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలని మంత్రి సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో గ్రామాల్లో చెరువులు ఎండిపోయే పరిస్థితులు కనిపిస్తున్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. అవసరమైతే ప్రైవేటు వ్యక్తుల బోర్ల నుంచి నీటిని కొనుగోలు చేసి ప్రజలకు సరఫరా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

రైతులకు అండగా ప్రభుత్వం

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంటల ఎంపిక, సాగు ప్రణాళిక, నీటి వినియోగంపై తగిన సూచనలు చేయాలని మంత్రి ఆదేశించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే వివరించి, వాటిని ఎదుర్కొనేందుకు రైతులను సిద్ధం చేయాలని సూచించారు. రైతులు ఎవరూ అధైర్యపడవద్దని, క్లిష్ట పరిస్థితుల్లోనూ సాగునీరు అందించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

రైతులకు వ్యవసాయ అవసరాల కోసం, ప్రజలకు గృహ అవసరాల కోసం నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని విద్యుత్ శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ఎండలు, నీటి ఎద్దడి వంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

పశుపక్షాదుల సంరక్షణకూ ప్రాధాన్యం

ఎల్‌నినో ప్రభావం మనుషులపైనే కాకుండా పశుపక్షాదులపైనా పడే అవకాశం ఉన్నందున వాటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. పశువులకు తాగునీరు, మేత అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించాలన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ రానున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

నీటి సంరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేస్తే ఎలాంటి పరిస్థితులనైనా సమర్థంగా ఎదుర్కోవచ్చని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఈ సమావేశంలో వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ ఎండి రహమతుల్లా ఎంపీడీవో, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మండలంలోని గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బాచుపల్లిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కలకలం

## మృతుడి ఆచూకీ కోసం పోలీసుల దర్యాప్తు

**బాచుపల్లి, అక్టోబర్ 24 (సిటీటైమ్స్):**

బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. క్రాంతినగర్ కాలనీలోని రోడ్డు నంబర్ 12 వద్ద శుక్రవారం (అక్టోబర్ 23) ఉదయం 9:15 గంటలకు సుమారు 30 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై క్రైమ్ నంబర్ 1004/2026, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 194 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు, గుర్తింపునకు సంబంధించిన ఆధారాల కోసం ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు. మృతుడికి సంబంధించిన సమాచారం తెలిసినవారు బాచుపల్లి పోలీస్ స్టేషన్‌ను లేదా 8801917408, 8712663169 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ కోరారు.



# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం...




- అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి: ఎస్పీ డి. సునీత రెడ్డి

**వనపర్తి, అక్టోబర్ 24 (సిటీటైమ్స్):**

పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయం నుంచి కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి ఐపీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. వారి త్యాగాలు పోలీసు శాఖకు నిరంతరం స్ఫూర్తినిస్తాయని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు.అమరవీరుల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ ర్యాలీ ద్వారా పోలీసుల సేవలు, బాధ్యతలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు, సమాజ భద్రతకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వీరా రెడ్డి, డీఎస్పీలు గిరిబాబు, బాలాజీ నాయక్, సీఐలు సుగంధ రత్నం, రమేష్, శివకుమార్, నరేష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, జిల్లాలోని ఎస్సైలు, పోలీసు సిబ్బంది, యువకులు తదితరులు పాల్గొన్నారు.







# మల్టీ డే మహాధర్నాను విజయవంతం చేయాలి




- సీఐటీయూ మండల కార్యదర్శి మందాపురం నరేష్
- కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 25,26 తేదీల్లో ధర్నా

**మేడ్చల్ (సిటీ టైమ్స్) అక్టోబర్ 24**

కేంద్ర బీజేపీ,రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా,కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న మల్టీ డే మహాధర్నాను విజయవంతం చేయాలని మెడిసిటీ,మేడ్చల్ మున్సిపల్ కార్మిక సంఘాల కమిటీల ఆధ్వర్యంలో శనివారం పోస్టర్‌ను విడుదల చేశారు.ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ ఎన్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ మండల కన్వీనర్ నరేష్ మాట్లాడుతూ,మహాధర్నాలో వివిధ రంగాలకు చెందిన కార్మికులు,ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘటిత శక్తిని చాటాలని పిలుపునిచ్చారు. మొదటి రోజు రాష్ట్రంలోని ప్రైవేట్ పరిశ్రమల కార్మికులు,ప్రభుత్వ రంగ సంస్థల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు.అక్టోబర్ 26న రెండో రోజు ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు,స్కీమ్ వర్కర్లు,కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, బీడీ కార్మికులు,భవన నిర్మాణ కార్మికులు,రవాణా రంగ కార్మికులు,హమాలీలు,ఇతర అసంఘటిత రంగ కార్మికులు పాల్గొంటారని వివరించారు.కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి తమ న్యాయమైన డిమాండ్లను సాధించుకోవాలని నరేష్ కోరారు.రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు మహాధర్నాలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మెడిసిటీ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్,
యూనియన్ నాయకులు రాంచందర్,బిక్షపతి,జగన్ గౌడ్,రమేష్,భాగ్య, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి మల్లేష్,గౌరవ అధ్యక్షుడు ప్రవీణ్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.




# కీసరలో దొంగల బీభత్సం!




- ఆర్ఎల్ నగర్‌లో ఇంట్లో చోరీ..
- 4 కిలోల వెండి, తులం బంగారం, రూ.25 వేల నగదు అపహరణ!

**కీసర, అక్టోబర్ 24(సిటీ టైమ్స్):**



కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్ఎల్ నగర్‌లో చోరీ ఘటన కలకలం రేపింది. కాలనీలోని ప్లాట్ నంబర్ 17లో నివసించే రఘురామ్ ఇంట్లో దొంగతనం జరిగినట్లు సమాచారం. ఇంట్లోకి చొరబడిన దుండగులు విలువైన వస్తువులను అపహరించినట్లు తెలుస్తోంది.ఈ ఘటనలో సుమారు 4 కిలోల వెండి వస్తువులు, ఒక తులం బంగారం, రూ.25 వేల నగదు చోరీకి గురైనట్లు సమాచారం. ఇంట్లో చోరీ జరగడంతో బాధితుడు ఆందోళనకు గురయ్యాడు. ఈ ఘటనతో స్థానికులు అప్రమత్తమయ్యారు.

**పోలీసుల నిఘా పెంచాలని స్థానికుల డిమాండ్**

కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీల నివారణకు పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీల్లో రాత్రి వేళ పోలీసుల గస్తీని ముమ్మరం చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ చోరీ ఘటనపై పోలీసుల అధికారిక ప్రకటన, కేసు నమోదు, దర్యాప్తు వివరాలు తెలియాల్సి ఉంది.

# ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన ఆహార భద్రత!

- నాగారం ఆర్టీసీ కాలనీలోని బేకర్స్ పాయింట్‌లో పోలీసుల తనిఖీలు
- గడువు ముగిసిన పదార్థాల నిల్వపై ఆరోపణలు.. సింథటిక్ ఫుడ్ కలర్ బాటిళ్లు స్వాధీనం
- ట్రేడ్ లైసెన్స్ లేకుండా బేకరీ నిర్వహిస్తున్నట్లు పోలీసుల నివేదికలో ప్రస్తావన
- కేసు నమోదు చేసిన కీసర పోలీసులు

**నాగారం, అక్టోబర్ 24(సిటీ టైమ్స్):**




ఆహార పదార్థాల నాణ్యత, గడువు తేదీలు, ఆహార భద్రతా నిబంధనల అమలు అంశాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. కీసర మండలం నాగారం ఆర్టీసీ కాలనీలోని బేకర్స్ పాయింట్‌పై కీసర పోలీసులు తనిఖీలు నిర్వహించి పలు ఆహార పదార్థాలతో పాటు ఫుడ్ కలర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గడువు ముగిసిన పదార్థాలను నిల్వ ఉంచుతున్నారనే సమాచారం, కేకుల తయారీలో సింథటిక్ ఫుడ్ కలర్స్ వినియోగిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది.

**పంచుల సమక్షంలో తనిఖీలు**

కీసర పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి. నాగరాజుకు అందిన సమాచారం మేరకు పోలీసులు అక్టోబర్ 22న పంచుల సమక్షంలో బేకరీలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బేకరీ నిర్వహణకు సంబంధించిన వివరాలను జాదవ్ సంతోష్ (44)ను అడిగి తెలుసుకున్నారు. సుమారు రెండున్నరేళ్లుగా బేకరీ నిర్వహిస్తున్నట్లు, ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నట్లు పోలీసుల నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

**పలు ఆహార పదార్థాలు స్వాధీనం**

తనిఖీల్లో భాగంగా ఫ్రైమ్స్/చిప్స్, కిన్లే సోడా, సాల్టెడ్ పాప్‌కార్న్, ఫిజ్ జీరా మసాలా, దానిమ్మ రసం, బ్రెడ్, రస్క్, షుగర్ పేస్ట్‌తో పాటు క్యారమెల్ ఫుడ్ కలర్, సింథటిక్ ఫుడ్ కలర్ బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. గడువు ముగిసిన పదార్థాల నిల్వ, ఫుడ్ కలర్స్ వినియోగానికి సంబంధించిన అంశాలపై తదుపరి విచారణ అవసరమని ఈ ఘటన సూచిస్తోంది.

**కేసు నమోదు.. ఆహార భద్రతపై దృష్టి**

ఈ ఘటనకు సంబంధించి కీసర పోలీసులు క్రైమ్ నంబర్ 1039/2026 కింద కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న పదార్థాల గడువు తేదీలు, నాణ్యత, ఫుడ్ కలర్స్ వినియోగం నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అనే అంశాలను సంబంధిత ఆహార భద్రతా అధికారులు పరిశీలించాల్సి ఉంది. తనిఖీల్లో గుర్తించిన అంశాలపై సమగ్ర విచారణ జరిపి, ఉల్లంఘనలు నిర్ధారణైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**ప్రజారోగ్య పరిరక్షణకు తనిఖీలు అవసరం**

బేకరీలు, హోటళ్లు, ఇతర ఆహార విక్రయ కేంద్రాల్లో నాణ్యమైన పదార్థాలను వినియోగించడం, గడువు తేదీలను పరిశీలించడం, అవసరమైన అనుమతులు, లైసెన్సులు పొందడం వ్యాపారుల బాధ్యత. ప్రజారోగ్యానికి సంబంధించిన అంశాల్లో నిర్లక్ష్యానికి తావు లేకుండా సంబంధిత శాఖలు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ఆహార భద్రతా నిబంధనల అమలును పర్యవేక్షిస్తూ, ఉల్లంఘనలు నిర్ధారణైన సందర్భాల్లో చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు అభిప్రాయపడుతున్నారు.

# కండ్లకోయ హాస్టల్‌లో ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

**మేడ్చల్, అక్టోబర్ 24 (సిటీ టైమ్స్):**



కండ్లకోయలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సాతెల్లి గ్రామానికి చెందిన జంగిటి అక్షయ (19) కండ్లకోయలోని సీఎంఆర్ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతోంది.ఈ క్రమంలో కండ్లకోయలోని ముకుందా హాస్టల్‌లో ఆమె ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.ఘటన గురించి సమాచారం అందుకున్న ఎస్సై మహేందర్ రెడ్డి వెంటనే సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఘటనపై విచారణ చేపట్టారు. విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడటానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

# దేశ నిర్మాణంలో లోధి సమాజ్ పాత్ర కీలకమైనది: కేంద్ర మంత్రి బి.ఎల్. వర్మ

- హైదరాబాద్‌లో వైభవంగా ముగిసిన అఖిల భారతీయ లోధి మహాసభ

**హైదరాబాద్, అక్టోబర్ 24,(సిటీ టైమ్స్):**



దేశ నిర్మాణంలో లోధి సమాజ్ అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తోందని కేంద్ర మంత్రి బి.ఎల్. వర్మ (బన్వారీ లాల్ వర్మ) అన్నారు.
శనివారం హైదరాబాద్ లోని ధూల్‌పేట్‌లోని 'రాణి అవంతీబాయి భవన్'లో అఖిల భారతీయ లోధిలోధా లోధి మహాసభ తెలంగాణ రాష్ట్ర విభాగం నిర్వహించింది. రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు కేంద్ర మంత్రి బి.ఎల్.వర్మతో పాటు జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే విపిన్ కుమార్ వర్మ (డేవిడ్), మధ్యప్రదేశ్ మంత్రి ప్రహ్లాద్ పటేల్, ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి జాలిమ్ సింగ్ పటేల్, మాజీ మంత్రి డాక్టర్ రవీందర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బి.ఎల్.వర్మ మాట్లాడుతూ... లోధి సమాజ సభ్యులంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా విద్య, ఉద్యోగ, రాజకీయ, వ్యాపార రంగాల్లో సమాజ ప్రజలు మరింత రాణించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం లోధి వర్గాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, సమాజమంతా సంఘటితంగా పోరాడితేనే సమాజానికి దక్కాల్సిన అభివృద్ధి నిధులు సాధించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.
అనంతరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ సింగ్ మాట్లాడుతూ... దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి లోధి సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, పెద్దలు ఈ మహాసభకు విచ్చేయడం ఎంతో గర్వకారణమన్నారు. తమ సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే స్వయం సమీక్ష చేసుకుంటూ, లోపాలను సవరించుకొని ముందుకు సాగాలని సూచించారు. దేశవ్యాప్తంగా వివిధ హోదాల్లో లోధి సమాజ సభ్యులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని, స్వల్ప వ్యవధిలోనే ఈ మహాసభను అత్యంత దిగ్విజయంగా నిర్వహించడం సంతోషకరమని తెలిపారు.
ఈ మహాసభలో జనరల్ సెక్రటరీ శైలేందర్ సింగ్, ఠాకూర్ జితేందర్ సింగ్, యూత్ ప్రెసిడెంట్ దీపక్ సింగ్, మహిళా అధ్యక్షురాలు లీనా సింగ్, జనరల్ సెక్రెటరీ నిషా సింగ్, కోశాధికారి అంజురాణి, ఉపాధ్యక్షురాలు పూజా సింగ్, దినేష్ సింగ్, పప్పు మాత్రే, ప్రశాంత్ సింగ్, రోహన్ సింగ్, ఉపేందర్ సింగ్లతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో లోధి సామాజిక వర్గానికి చెందిన మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# బాస్కెట్‌బాల్ విజేత గుజరాత్.. వాలీబాల్ విజేత గోవా

**హైదరాబాద్, అక్టోబర్ 24,(సిటీ టైమ్స్):**

ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) బర్కత్‌పుర రీజినల్ ఆఫీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఈపీఎఫ్ఓ వెస్ట్ జోన్ బాస్కెట్ బాల్ అండ్ వాలీబాల్ టోర్నమెంట్' శనివారం ముగిసింది. నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రాంగణంలో అక్టోబర్ 23, 24 తేదీలలో ఈ పోటీలు జరిగాయి. ఈ టోర్నీలో తెలంగాణ, గోవా, గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన ఐదు జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి.
పోటీలను తెలంగాణ అడిషనల్ సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విపిన్ కుమార్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్లు శ్రీకాంత్ జి. పుల్‌పగార్, తేజ్ ప్రతాప్ సింగ్ యాదవ్ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. రెండు రోజుల పాటు సాగిన ఈ క్రీడా పోటీలు ఉద్యోగుల్లో క్రీడా స్ఫూర్తిని, క్రమశిక్షణను, జట్టు భావాన్ని పెంపొందించాయి.
హోరాహోరీగా సాగిన పోటీల్లో బాస్కెట్ బాల్ విభాగంలో గుజరాత్ జట్టు విజేతగా నిలవగా, వాలీబాల్ విభాగంలో గోవా జట్టు ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ముగింపు ఉత్సవాలకు రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పి.ఆర్. శ్రీజిత్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.



www.citytimesnews.com
GENERAL NEWS
epaper.citytimesdaily.com
సిటీ టైమ్స్
తెలుగు దినపత్రిక
ఆదివారం ꞉ హైదరాబాద్
25.10.2026
I

# ఐపీ ఛానళ్లకు అక్రెడిటేషన్లు ఇవ్వలేం: మంత్రి పొంగులేటి

**- జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు కేటాయింపు**

**హైదరాబాద్, అక్టోబర్ 24,(సిటీ టైమ్స్):**

కేబుల్ టీవీల స్థానంలో కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఇంటర్నెట్ ప్రోటోకాల్ టెలివిజన్ (ఐపీ) ఛానళ్లకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వడం కుదరదని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నేతృత్వంలో ప్రతినిధుల బృందం శనివారం సచివాలయంలో మంత్రిని కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించింది.



ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అక్రెడిటేషన్ల ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో 22 వేల కార్డులు ఇస్తే, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఇప్పటికే 26 వేల కార్డులు జారీ చేసిందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందిస్తామని తెలిపారు. అయితే గతంలో లేని ఐపీ ఛానళ్లకు కొత్తగా అక్రెడిటేషన్లు ఇవ్వడం సాధ్యపడదని తేల్చి చెప్పారు.

శాశ్వత పరిష్కార దిశగా చర్యలు:

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలోనే అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించి సొంతింటి కలను సాకారం చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. గతంలో ఎదురైన న్యాయపరమైన చిక్కులు పునరావృతం కాకుండా చట్టబద్ధంగా శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో కాంగ్రెస్ పాలనలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని, మళ్లీ తమ ప్రభుత్వంలోనే ఇస్తామని స్పష్టం చేశారు.

వివిధ డిమాండ్లతో వినతిపత్రం:

అంతకుముందు టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ.. సాంకేతిక మార్పులకు అనుగుణంగా కేబుల్ నెట్‌వర్క్ నుంచి ఐపీ ఆధారంగా నడుస్తున్న న్యూస్ ఛానళ్లకు కూడా అక్రెడిటేషన్లు ఇవ్వాలని కోరారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే జర్నలిస్టులకు హెల్త్ కార్డులు జారీ చేయాలని, 60 ఏళ్లు దాటిన సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ పథకం వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కుంచం శ్రీనివాస్, రవికుమార్, కేబుల్ ఛానల్స్ అసోసియేషన్ ప్రతినిధులు సుభాష్, భరత్, శ్రీరాములు, షఫియుద్దీన్, ప్రతాప్, రాచర్ల గోపి, సుధాకర్, విఘ్నేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి





**- అక్టోబర్ 26 ఇందిరాపార్క్ ధర్నాను జయప్రదం చేయాలి: సీఐటీయూ నాయకులు**

**శామీర్‌పేట్, అక్టోబర్ 24(సిటీటైమ్స్ ):**

మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, అక్టోబర్ 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే రాష్ట్రస్థాయి మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

ఈ మేరకు శామీర్‌పేట్ మండలంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ, అక్టోబర్ 25న పరిశ్రమల కార్మికులు, 26న ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, మధ్యాహ్న భోజన కార్మికులు, బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్లు, ఆటో కార్మికులు, మున్సిపల్ కార్మికులు భారీ సంఖ్యలో ధర్నాలో పాల్గొంటారని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వేలాది మంది కార్మికులు పారిశుద్ధ్యం, చెత్త సేకరణ, రవాణా వంటి కీలక సేవలను అందిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్నప్పటికీ, వారికి సరైన వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేక కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు.

మున్సిపల్ కార్మికులందరినీ శాశ్వత ఉద్యోగులుగా (పర్మినెంట్) చేయాలని, రెండో పీఆర్సీని ప్రకటించాలని, కనీస వేతనాన్ని నెలకు రూ.30 వేలుగా నిర్ణయించాలని, డీఏ అమలు చేయాలని, జీవో నంబర్ 1181ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మరణించిన, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ఆరోగ్య భద్రత, ఇతర చట్టబద్ధమైన సౌకర్యాలను కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కార్మికుల ఐక్యతతోనే హక్కులు సాధ్యమవుతాయని పేర్కొంటూ, అక్టోబర్ 26న ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాలో మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కె. ఉన్నికృష్ణన్, మున్సిపల్ జిల్లా నాయకులు ప్రశాంత్, శ్రీను, రమేష్, బలేష్, బిక్షపతితో పాటు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# బీసీ-ఏ హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటం

**- వనపర్తిలో సోమవారం బీసీ-ఏ కుల సంఘాల సమావేశం**

**వనపర్తి అక్టోబర్ 24 (సిటీటైమ్స్ ):**

ముదిరాజులను బీసీడీ నుంచి బీసీఏలో చేర్చే ప్రతిపాదన నేపథ్యంలో బీసీఏ వర్గాల హక్కులు, విద్యా, ఉద్యోగ అవకాశాల పరిరక్షణకు ఐక్య కార్యాచరణ రూపొందించాలని వనపర్తి జిల్లా బీసీఏ రజక ఉద్యోగుల సంఘం నిర్ణయించింది.ఈ మేరకు సోమవారం సాయంత్రం 5.30 గంటలకు వనపర్తిలోని వెంగళరావు నగర్ కాలనీలో బీసీఏ కుల సంఘాల సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి ఉద్యోగులు, కుల సంఘాల నాయకులు, మేధావులు, విద్యార్థులు హాజరై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని సంఘం విజ్ఞప్తి చేసింది. బీసీఏ వర్గాల హక్కులు, అవకాశాల పరిరక్షణకు భవిష్యత్ కార్యాచరణ రూపొందించడంలో అందరూ భాగస్వాములు కావాలని కోరింది.





# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**- 4వ వార్డులో పర్యటించిన మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల ధర్మ**

**- వార్డులో మౌలిక వసతుల పరిశీలన.. ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలపై ఆరా**

**వడ్డేపల్లి అక్టోబర్ 24 (సిటీటైమ్స్)**

వడ్డేపల్లి ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యమివ్వడమే లక్ష్యంగా వడ్డేపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల ధర్మ, వడ్డేపల్లి అజయ్ కుమార్ 4వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

వార్డులో మురుగు కాలువలు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, రహదారులు, డ్రైనేజీ నిర్వహణ వంటి మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. వార్డులో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రజల వద్దకే పాలన.. సమస్యల పరిష్కారానికి కృషి

ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ విజయ భాస్కర్, 10వ వార్డు కౌన్సిలర్ తిమ్మప్ప, నాయకి అంజి, దినేష్, బోయ ఆంజనేయులు, నాగరాజు, మహేంద్ర గౌడ్, శేఖర్, వేణు, ఆంజనేయులు తదితరులు, 4వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.







# అలియాబాద్‌లో ధర్నా పోస్టర్ ఆవిష్కరణ – కార్మికులకు సీఐటీయూ పిలుపు

**- రూ.42 వేల కనీస వేతనం, ఈఎస్ఐ–పీఎఫ్ అమలు చేయాలి**

**- అక్టోబర్ 26 ఇందిరాపార్క్ ధర్నాను జయప్రదం చేయాలి**

**శామీర్‌పేట్, అక్టోబర్ 24 (సిటీటైమ్స్ )**

: అక్టోబర్ 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ ఆదివారం అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఏ. అశోక్, శామీర్‌పేట్ మండల కార్యదర్శి ఎం. కిష్టప్ప మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 26న జరిగే ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వారు ప్రభుత్వానికి పలు డిమాండ్లు వినిపించారు. కార్మికులందరికీ నెలకు కనీసం రూ.42 వేల వేతనం అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులందరినీ శాశ్వత ఉద్యోగులుగా (పర్మినెంట్) నియమించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ ధర్నాకు అన్ని వర్గాల కార్మికులు, ఉద్యోగులు సంఘీభావం తెలిపి పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# జవహర్ నగర్ లో సిపిఐ ఆధ్వర్యంలో నిరసన



**- మంచినీటి లీకేజీ ను అరికట్టాలంటూ జలమండలి జీఎం కు వినతి పత్రం సమర్పణ..**

**శామీర్ పేట్, అక్టోబర్ 24( సిటీటైమ్స్ ) :-**

జవహర్ నగర్ లో మంచినీటి లీకేజీ సమస్యను అరికట్టాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో జలమండలి జీఎం సునీల్ ను కలిశారు. అనంతరం సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నర్సింహ, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిహెచ్ దశరథ్ లు మాట్లాడుతూ ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, అయితే దీని కారణంగా ప్రస్తుతం జలవనరులను కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని వారు వెల్లడించారు. అయితే నీటిని అరికట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వలన పలు చోట్ల నీటి వృథాను అరికట్టడం లేదని వాపోయారు. ఇక జవహర్ నగర్ లోని వికలాంగుల కాలనీలో పైప్ లైన్ లు లీకేజీ అవడంతో రహదారులపై నీరంతా వృథాగా పోతుందని, ఈ సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని వాపోయారు. తక్షణమే అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దర్శనం యాదగిరి, వెంకటాచారి, ఎల్లయ్య, నర్సింహ, కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ మహారాష్ట్ర పర్యటన.. కేఆర్ఎంబీ సమావేశం వాయిదా

సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా పడింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల్లో వాటా, ఇతర అంశాలపై చర్చించేందుకు ఈ నెల 26న కేఆర్ఎంబీ 21వ సమావేశం ఏర్పాటు చేశారు. అయితే తుమ్మిడిహెట్టి విషయమై చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదే రోజు ముంబయి వెళ్తున్నందున... తాము కూడా వెళ్లాల్సి ఉంటుందని, బోర్డు సమావేశానికి హాజరు కావడం వీలు కాదని తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ తెలిపారు. ఈ మేరకు ఆయన కేఆర్ఎంబీకి లేఖ రాశారు. సోమవారం తలపెట్టిన సమావేశం వాయిదా వేయాలని కోరారు. తెలంగాణ విజ్ఞప్తి మేరకు సమావేశాన్ని వాయిదా వేసిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు... తదుపరి సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు సమాచారం అందించింది.



సిటీటైమ్స్ తెలుగు దినపత్రిక
www.citytimesnews.com
GENERAL NEWS
epaper.citytimesdaily.com



# గుండె ఆరోగ్యానికి 5 ఉత్తమ వంట నూనెలు

భారతీయ వంటకాలకు అనుకూలమైన 5 రకాల నూనెలను గుండె వ్యాధుల నిపుణులు డాక్టర్ అలోక్ చోప్రా సూచిస్తున్నారు. వీటిలో నెయ్యి, ఆవాల నూనె కూడా ఉన్నాయి. ఈ నూనెలు ఆరోగ్యానికి ఎన్నో రకాల ప్రయోజనాలను అందిస్తాయి. గుండె ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. అసంతృప్త కొవ్వులు ఎక్కువగా ఉండే నూనెను ఎంచుకోవడం గుండె ఆరోగ్యానికి చాలా అవసరం. అయితే, భారతీయ వంటకాల్లో నూనెను పూర్తిగా తీసివేయడం కష్టం. కాబట్టి, ఏ నూనె మన వంటకాలకు సరిపోతుందో తెలుసుకోవడం, అలాగే పాశ్చాత్య వంట శైలికి సరిపోయే ట్రెండ్‌లను అనుసరించకుండా ఉండటం అవసరం.



భారతీయ వంటకాలకు ఉత్తమ నూనెలు కార్డియాలజిస్ట్, ఫంక్షనల్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ అలోక్ చోప్రా ప్రకారం.. భారతీయ వంటకాలకు సరిపోయే ఐదు ఉత్తమ నూనెలు ఉన్నాయి. జూన్ 15న షేర్ చేసిన ఒక వీడియోలో ఆయన ఈ జాబితాను పంచుకున్నారు. ఇది కేవలం ట్రెండ్‌లను బట్టి కాకుండా సైన్స్ ఆధారంగా తయారు చేసిన జాబితా అని ఆయన నొక్కి చెప్పారు. "భారతీయ వంటకాలకు ఉత్తమ నూనెలు.. సైన్స్ మద్దతుతో.. ట్రెండ్స్‌తో కాదు. మీ ఆహారానికి, మీ శరీరానికి ఏది పని చేస్తుందో తెలుసుకోండి" అని కార్డియాలజిస్ట్ రాశారు.



1. నెయ్యి:

నెయ్యిలో విటమిన్లు A, D, E, K పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణక్రియను, రోగనిరోధక శక్తిని పెంచుతుందని డాక్టర్ చోప్రా తెలిపారు.

2. కొబ్బరి నూనె:

కొబ్బరి నూనె మెదడు, పేగుల ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో మీడియం-చైన్ ట్రైగ్లిజరైడ్స్ కూడా పుష్కలంగా ఉంటాయని చెప్పారు. అంటే కొబ్బరి, పామ్ కెర్నెల్ నూనెల నుండి తయారయ్యే కొవ్వు అణువులు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ ప్రకారం MCTS శరీరంలో త్వరగా జీర్ణమై తక్షణ శక్తి వనరుగా ఉపయోగపడతాయి. ఇవి మంచి శారీరక, క్రియాత్మక లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి వివిధ ఆరోగ్య సమస్యలకు చికిత్స చేయడంలో సహాయపడతాయి.



3. ఆవాల నూనె:

డాక్టర్ చోప్రా ప్రకారం.. ఆవాల నూనె గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. శరీరంలో మంటను తగ్గిస్తుంది. ఇది మీ గుండెకు మంచి మిత్రుడిలా పనిచేస్తుంది. అంతేకాకుండా ఇందులో ఒమేగా-5 ఫ్యాటీ యాసిడ్స్ కూడా పుష్కలంగా ఉంటాయి.

4. నువ్వుల నూనె:

నువ్వుల నూనె కీళ్ళు, చర్మ ఆరోగ్యానికి సహాయకారిగా నిలుస్తుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇది భారతీయ వంటకాలకు గొప్ప ఎంపిక.

`5. వేరుశనగ నూనె:

వేరుశనగ నూనెలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్లాంట్ స్టెరాల్స్ పుష్కలంగా ఉంటాయని కార్డియాలజిస్ట్ వివరించారు. దీనిని మితంగా ఉపయోగించినప్పుడు గుండెకు మంచిదని ఆయన హెచ్చరించారు.



# పిల్లల్లో మెదడు క్యాన్సర్: గుర్తించాల్సిన లక్షణాలు, చికిత్సా విధానాలు





మెదడు క్యాన్సర్ అంటే మెదడులో కణాలు అసాధారణంగా పెరిగిపోవడం. ఇది పెద్దవారిలో ఎక్కువగా కనిపించినా, పిల్లల్లో కూడా వచ్చే అవకాశం ఉంది. ఈ క్యాన్సర్‌ను ఎంత త్వరగా గుర్తిస్తే, చికిత్సను అంత వేగంగా మొదలుపెట్టవచ్చు. దీనివల్ల పిల్లలు ఆరోగ్యంగా జీవించే అవకాశాలు చాలా మెరుగుపడతాయని విజయవాడ మణిపాల్ హాస్పిటల్స్ న్యూరో, స్పైన్ సర్జన్ డాక్టర్ సుధీర్ కుమార్ తెలిపారు. మెదడు క్యాన్సర్ లక్షణాలు, చికిత్స విధానాల గురించి ఆయన వివరించారు.

ప్రాథమిక లక్షణాలు

పిల్లల్లో మెదడు క్యాన్సర్ లక్షణాలు అచ్చం మామూలు జబ్బుల్లాగే అనిపించవచ్చు. అయితే, కొన్ని సంకేతాలను తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా గమనించాలి.

తరచుగా తలనొప్పి: ముఖ్యంగా ఉదయం పూట ఎక్కువగా ఉండటం లేదా నిద్రలోంచి లేపేంత తీవ్రంగా తలనొప్పి రావడం.

వాంతులు: ఇది కూడా ఉదయం పూట ఎక్కువగా, ఆహారంతో సంబంధం లేకుండా జరుగుతాయి.

కంటి చూపు సమస్యలు: కళ్ళు మసకబారడం, లేదంటే ఒకే వస్తువు రెండుగా కనిపించడం (డబుల్ విజన్).

నడవడంలో ఇబ్బంది: సరిగా బ్యాలెన్స్ చేసుకోలేకపోవడం, తరచుగా కింద పడిపోవడం.

ప్రవర్తనలో మార్పులు: పిల్లలు చిరాకుగా ఉండటం, ఎక్కువ నిద్రపోవడం, చదువులో వెనుకబడటం.

మూర్ఛలు (సీజర్స్): అకస్మాత్తుగా చేతులు, కాళ్లు కదలడం లేదా స్పృహ కోల్పోవడం.

తల పరిమాణం పెరగడం: చిన్న పిల్లలు, పసిపిల్లల్లో తల పెద్దగా మారడం ఒక హెచ్చరిక సంకేతం కావచ్చు.

ఈ లక్షణాల్లో ఒకటి కంటే ఎక్కువ కనిపిస్తే, పైగా అవి రోజురోజుకు పెరుగుతున్నట్లయితే, తల్లిదండ్రులు వెంటనే వైద్యుడిని సంప్రదించడం తప్పనిసరి.

చికిత్సా విధానాలు

పిల్లల్లో మెదడు క్యాన్సర్‌కు చికిత్స, ట్యూమర్ రకం, దాని పరిమాణం, అది ఎక్కడ ఉందనే దానిపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యమైన చికిత్సా పద్ధతులు ఇక్కడ ఉన్నాయి.

శస్త్రచికిత్స: వీలైనంత వరకు ట్యూమర్‌ను తొలగించడానికి ఆపరేషన్ చేస్తారు.

రేడియేషన్ థెరపీ: హై-ఎనర్జీ కిరణాలను ఉపయోగించి క్యాన్సర్ కణాలను నాశనం చేస్తారు. అయితే, పిల్లల మెదడు ఇంకా ఎదుగుదల దశలో ఉంటుంది కాబట్టి, ఈ చికిత్సను చాలా జాగ్రత్తగా, అవసరమైన మేరకు మాత్రమే ఉపయోగిస్తారు.

కీమోథెరపీ: క్యాన్సర్ కణాలను చంపడానికి మందులు ఇస్తారు. వీటిని నోటి ద్వారా గానీ, ఇంజెక్షన్ల రూపంలో నేరుగా నరాలలోకి గానీ ఇవ్వవచ్చు.

టార్గెటెడ్ థెరపీ: కొన్ని సందర్భాల్లో, క్యాన్సర్ కణాల్లో ఉండే కొన్ని ప్రత్యేక మార్పులను లక్ష్యంగా చేసుకుని పనిచేసే మందులను ఉపయోగిస్తారు. చిన్నపిల్లల్లో మెదడు క్యాన్సర్‌ను సరైన సమయంలో గుర్తించి, సరైన చికిత్స అందించడం ద్వారా వారు తిరిగి ఆరోగ్యంగా, సంతోషంగా జీవించగలరు. అంతేకాకుండా, ఫిజికల్ థెరపీ, మానసిక మద్దతు వంటి సహాయక చికిత్సలు కూడా పిల్లలు త్వరగా కోలుకోవడానికి చాలా ముఖ్యమైనవి.



సిటీటైమ్స్
తెలుగు దినపత్రిక
www.citytimesnews.com
GENERAL NEWS
epaper.citytimesdaily.com




# రాజకీయాలకు అతీతంగా సహకరించాలి

హైదరాబాద్, సిటీటైమ్స్

ఖమ్మంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్రంలో తలెత్తిన తీవ్ర వాతావరణ పరిస్థితులు, విద్యుత్ డిమాండ్ , తాగునీటి లభ్యతపై కీలక ప్రకటనలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా వంద దేశాల్లో 'సూపర్ ఎల్ నినో' ప్రభావం తీవ్రంగా ఉందని, దీనివల్ల భవిష్యత్తులో గడ్డు పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. లండన్ వంటి అంతర్జాతీయ నగరాల్లోనూ తాగునీటి వృథాను అరికడుతున్నారని, మహారాష్ట్రలో ఇప్పటికే నీటి వాడకంపై కోటాలు విధించారని గుర్తుచేశారు. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

రాజకీయ విమర్శలు పక్కనపెట్టి ప్రభుత్వానికి సహకరించాలి

కష్టకాలంలో కేవలం రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయడం సరికాదని డిప్యూటీ సీఎం హితవు పలకారు. కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు దేశవ్యాప్తంగా ప్రభుత్వాలకు ఏ విధంగానైతే అందరూ సహకరించారో, ప్రస్తుత ఎల్ నినో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలోనూ ప్రతిపక్షాలు అదే విధంగా బాధ్యతయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో తాగునీటి సమస్యను అధిగమించడానికి లభించే ప్రతి చుక్క నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజకీయ ప్రకటనలు మాని, ప్రజల మనుగడ కోసం అందరూ ఉన్నతమైన ఆలోచనలతో ముందుకు రావాలని కోరారు.

క్షీణిస్తున్న నీటి వనరులు.. ఏడాదిపాటు సరిపడా ఆహార నిల్వలు

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా దాదాపు 71 శాతం చెరువుల్లో నీటిమట్టాలు గణనీయంగా క్షీణించినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రాబోయే పది నెలల పాటు ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా, జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని హెచ్చరించారు. అయితే ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, రాష్ట్రంలో ప్రస్తుతం ఏడాది కాలానికి సరిపడా ఆహార పదార్థాల నిల్వలు సురక్షితంగా అందుబాటులో ఉన్నాయని భరోసా కచ్చారు. నీటి కొరతను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం వద్ద పక్కా ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు.

భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్

ఎల్ నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగంపై అసాధారణ భారం పడుతోందని డిప్యూటీ సీఎం వివరించారు. గత సంవత్సరాలతో పోలిస్తే పీక్ డిమాండ్ విపరీతంగా పెరిగిందని గణాంకాలతో సహా చెప్పారు. 2014లో రాష్ట్రంలో కేవలం 6,648 మెగావాట్లుగా ఉన్న పీక్ డిమాండ్, 2023 నాటికి 15,497 మెగావాట్లకు, 2025 నాటికి 17,162 మెగావాట్లకు చేరిందని తెలిపారు. ప్రస్తుతం ఈ డిమాండ్ ఏకంగా 20,018 మెగావాట్లకు పెరిగిందని, ఒక్క అక్టోబర్ నెలలోనే విద్యుత్ డిమాండ్ 37 శాతం అధికంగా నమోదైందని వెల్లడించారు.

ముందస్తు ప్రణాళికతో విద్యుత్ సరఫరా

రాష్ట్రంలో ప్రస్తుతం దాదాపు 30 లక్షల వ్యవసాయ పంపు సెట్లు ఉన్నప్పటికీ, డిమాండ్ భారీగా పెరిగినప్పటికీ విద్యుత్ శాఖ ఎంతో సమర్థవంతంగా సరఫరా చేస్తోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఎలాంటి అంతరాయాలు లేకుండా రైతులకు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం ముందుచూపుతో కూడిన ప్రణాళికలతో మునుపటి కంటే మెరుగైన చర్యలు తీసుకుంటోందని ఆయన పునరుద్ఘాటించారు.

# ర్యాలీ వాయిదా వేయండి
## రాహుల్‌గాంధీకి వ్యాపారుల విజ్ఞప్తి

- పండుగల సమయం నడుస్తున్నది
- నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ మెగా ర్యాలీ
- ర్యాలీ వాయిదా వేయండి

హైదరాబాద్, సిటీటైమ్స్

'ఓటును కాపాడండి.. దేశాన్ని కాపాడండి' అంటూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని రామ్ లీలా మైదాన్‌లో నవంబర్ 1న మెగా ర్యాలీ చేపట్టింది. అయితే ఈ ర్యాలీపై వ్యాపారవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీపావళి వంటి పెద్ద పండుగలు ఉన్న నేపథ్యంలో ర్యాలీని వాయిదా వేయాలని కోరుతూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి ఢిల్లీలోని ప్రముఖ వ్యాపారులు, పారిశ్రామికవేత్తల సంస్థ అయిన ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ లేఖ రాసింది. ర్యాలీని దీపావళి వరకు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. పండుగల సమయంలో వ్యాపారం దెబ్బతింటుందని పేర్కొన్నారు.
రాహుల్ గాంధీకి రాసిన లేఖలో సీటీఐ చైర్మన్ బ్రిజేష్ గోయల్ ఇలా పేర్కొన్నారు. 'నవంబర్ 1వ తేదీన రామ్‌లీలా మైదాన్‌లో మీ పార్టీ ఒక భారీ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు మాకు సమాచారం అందింది. ప్రస్తుతం దీపావళి వ్యాపారం జోరుగా సాగుతున్నందున ఈ ర్యాలీని నవంబర్ 10వ తేదీ వరకు వాయిదా వేయాలని మేము వినయపూర్వకంగా అభ్యర్థిస్తున్నాము.'' అని కోరారు.
ర్యాలీ కారణంగా ట్రాఫిక్ మళ్లింపులు, మెట్రో స్టేషన్ల మూసివేతలు, బారికేడ్లు ఏర్పాటు చేయడం వంటివి మార్కెట్లకు పూర్తి అంతరాయం కలిగిస్తాయని పేర్కొన్నారు. ర్యాలీ సమయంలో రోడ్ల మూసివేత, జనసమూహాల వల్ల ఢిల్లీ బయట నుంచి రాకపోకలు సాగించే ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలగవచ్చని, భయం కారణంగా కొనుగోలుదారులు ఢిల్లీకి రావడం మానుకోవచ్చని.. ఇది ధంతేరస్, దీపావళి వ్యాపారంపై నేరుగా ప్రభావం చూపుతుందని గోయల్ తెలిపారు.

# పీఎం రాహత్ పథకం
## ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వైద్యం

- సీఎస్ సంజయ్ జాజు
- ఆసుపత్రుల నమోదును వేగవంతం చేయాలి

రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సీఎస్ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ఈ పథకం అమలుపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, రవాణా శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు గోల్డెన్ అవర్‌లో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఎం రాహత్ పథకం కింద ఒక్కో బాధితుడికి రూ.1.5 లక్షల వరకు వైద్య చికిత్స అందించే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం కింద వెయ్యికి పైగా ఆసుపత్రులు నమోదై ఉండగా.. పీఎం రాహత్‌లో ఇప్పటివరకు 469 ఆసుపత్రులే నమోదు అయ్యాయని అధికారులు తెలిపారు. మిగిలిన నెట్‌వర్క్ ఆసుపత్రులను కూడా ఈ పథకంలో నమోదు చేయించాలని సీఎస్ ఆదేశించారు. పీఎం రాహత్ ద్వారా ఏటా కనీసం రూ.100 కోట్ల మేర వైద్య సహాయం అందించే అవకాశం ఉందని, దీని అమలుతో ఆరోగ్యశ్రీపై ఆర్థిక భారం తగ్గే వీలుందని పేర్కొన్నారు. చికిత్స అందించే సమయంలో పోలీసు దర్యాప్తుతో పాటు పథకానికి సంబంధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

# జూబ్లీహిల్స్ ఎలివేటెడ్ కారిడార్ పనులు వేగవంతం చేయాలి

- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశాలు

జూబ్లీహిల్స్, అక్టోబర్ 24 (సిటీ టైమ్స్):



హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించి, వాహనాల రాకపోకలను మరింత సులభతరం చేసేందుకు ప్రతిపాదించిన జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ఎన్‌ఎఫ్‌సీఎల్ జంక్షన్ వరకు 4.3 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, సీనియర్ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ కారిడార్ ద్వారా సిగ్నల్ రహిత ట్రాఫిక్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ప్రధాన జంక్షన్ల వద్ద రద్దీని తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించారు.

**జంక్షన్ల అభివృద్ధికి ప్రాధాన్యం**

కేబీఆర్ పార్క్ పరిసరాల్లో వన్‌వే ట్రాఫిక్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన జంక్షన్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు. కేబీఆర్ పార్క్ ప్రధాన ప్రవేశ ద్వారం, అగర్సేన్ జంక్షన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద రహదారుల అభివృద్ధి, ట్రాఫిక్ నిర్వహణకు అవసరమైన అప్‌గ్రేడేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

**యుటిలిటీల తరలింపునకు చర్యలు**

కారిడార్ నిర్మాణానికి ఆటంకాలు లేకుండా కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ఉన్న యుటిలిటీల తరలింపునకు తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎస్‌పీడీసీఎల్) అధికారులతో తక్షణమే సమన్వయం చేసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. వివిధ విభాగాల మధ్య సమన్వయంతో పనులు చేపట్టి ప్రాజెక్టు జాప్యాన్ని నివారించాలని ఆదేశించారు.

**ఫౌండేషన్ పనులు వేగవంతం చేయాలి**

ముగ్ధ జంక్షన్ నుంచి ఎన్‌ఎఫ్‌సీఎల్ జంక్షన్ వరకు ప్రతిపాదిత మార్గంలో ఫౌండేషన్ డిజైన్‌కు సంబంధించిన జియోటెక్నికల్ పరిశోధనలను వేగవంతం చేయాలని కమిషనర్ సూచించారు. నిర్మాణానికి అవసరమైన సాంకేతిక పరిశీలనలను త్వరగా పూర్తి చేసి, తదుపరి పనులకు మార్గం సుగమం చేయాలన్నారు.
అదేవిధంగా, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ముగ్ధ జంక్షన్ వరకు ఫౌండేషన్ తవ్వకాల పనులను వేగవంతం చేయడంతో పాటు, అవసరమైన స్టీల్ నిర్మాణాల ఆఫ్‌సైట్ ఫ్యాబ్రికేషన్ పనులను సమాంతరంగా చేపట్టాలని ఆదేశించారు.

**నగర ట్రాఫిక్‌కు ఊరట**

ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం పూర్తయితే జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్క్ పరిసరాలు, ముగ్ధ జంక్షన్, ఎన్‌ఎఫ్‌సీఎల్ జంక్షన్ మార్గాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు దోహదపడే అవకాశం ఉంది. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# బషీర్‌బాగ్‌లో రాముడి విగ్రహం తొలగింపు

హైదరాబాద్, సిటీటైమ్స్



హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రధాన కూడలిలో శ్రీరాముడి విగ్రహం తొలగింపు తీవ్ర వివాదానికి దారితీసింది. ఇటీవల దసరా పర్వదినం సందర్భంగా హిందూ సంఘాలు ఏర్పాటు చేసిన రాముడి విగ్రహాన్ని శనివారం అధికారులు తొలగించడంతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శ్రీరాముడి విగ్రహాన్ని తొలగించిన విషయం తెలిసి హిందూ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మరోవైపు.. విగ్రహం ఏర్పాటుకు అవసరమైన అనుమతులు ఉన్నాయా.. కూడలి పేరును మార్చే ప్రతిపాదన ఏమైనా ఉందా అనే ప్రశ్నలు కూడా ఈ వివాదంలో ముందుకొచ్చాయి.
హైదరాబాద్‌లోని కీలక ప్రాంతాల్లో ఒకటైన బషీర్‌బాగ్ చౌరస్తాలో అమ్మవారి ఆలయం సమీపంలో శ్రీరాముడి విగ్రహాన్ని విజయదశమి సందర్భంగా ఏర్పాటు చేశారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవినూతల శశిధర్ ఈ విగ్రహ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. ఇక నుంచి బషీర్‌బాగ్ కూడలిని 'శ్రీరామ్ చౌక్'గా పిలవాలని ఆయన హిందువులకు పిలుపునిచ్చారు. అయితే.. బషీర్‌బాగ్ చౌరస్తా పేరును మార్చాలన్న పిలుపుపై మజ్లిస్ బచావో తెహ్రీక్ (ఎంబీటీ) నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కూడలి పేరు మార్పు విషయంలో అధికారికంగా ఏమైనా ప్రతిపాదన ఉందా.. అక్కడ శ్రీరాముడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతులు తీసుకున్నారా అనే అంశాలపై ఎంబీటీ ప్రశ్నలు లేవనెత్తింది. ఈ నేపథ్యంలోనే బషీర్‌బాగ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన శ్రీరాముడి విగ్రహాన్ని అధికారులు శనివారం తొలగించారు. క్రేన్ సాయంతో విగ్రహాన్ని అక్కడి నుంచి తీసి.. లారీలోకి ఎక్కించారు. ఈ పరిణామంతో బషీర్‌బాగ్ చౌరస్తా వద్ద తీవ్ర ఉద్రిక్తత మొదలైంది. విగ్రహం తొలగింపు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ ఎత్తున పోలీసులు మోహరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.
దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించడంపై కొందరు హిందూ సంఘాల ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విగ్రహాన్ని అక్కడే కొనసాగించాలని.. బషీర్‌బాగ్ కూడలికి 'శ్రీరామ్ చౌక్'గా పేరు పెట్టాలని గతంలో కొందరు సంఘాల నాయకులు కోరినట్లు తెలుస్తోంది. అయితే విగ్రహం తొలగింపునకు సంబంధించి అధికారుల నుంచి స్పష్టమైన కారణాలు వెల్లడించాల్సి ఉంది.
మజ్లిస్ బచావో తెహ్రీక్ అధికార ప్రతినిధి అంజద్ ఉల్లా ఖాన్ ఈ వ్యవహారంపై ప్రశ్నలు లేవనెత్తారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), హైదరాబాద్ నగర పోలీసుల అనుమతి లేకుండానే విగ్రహాన్ని ఏర్పాటు చేశారని ఆయన ఆరోపించారు. కూడలి పేరును మార్చాలని పిలుపునిచ్చిన సమయంలో అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.
బషీర్‌బాగ్ చౌరస్తా హైదరాబాద్‌లో రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లలో ఒకటి. ఈ నేపథ్యంలో అక్కడ శ్రీరాముడి విగ్రహం ఏర్పాటు.. కూడలి పేరు మార్పు, అనుమతుల అంశాలు తీవ్ర వివాదానికి కారణం అయ్యాయి. ఒకవైపు విగ్రహం తొలగింపుపై హిందూ సంఘాల అభ్యంతరాలు వ్యక్తం అవుతుండగా.. మరోవైపు అనుమతులపై ఎంబీటీ ప్రశ్నలు లేవనెత్తింది. దీంతో అధికారుల వైఖరిపై ఆసక్తి నెలకొంది.

# కాళేశ్వరం పునరుద్ధరణకు ఆర్మీ ఇంజనీర్

హైదరాబాద్, సిటీటైమ్స్




సచివాలయంలో జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పెద్దలు తెలంగాణ ప్రజలకు అబద్ధాలు, అసత్యాలు చెబుతూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు రిహాబిలిటేషన్ పనుల కోసం ఆర్మీలో పనిచేస్తున్న నిపుణ ఇంజనీర్ పరిక్షిత్ మెహ్రాను రాష్ట్ర ప్రభుత్వం డిప్యుటేషన్‌పై నియమించిందని వెల్లడించారు. దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, అంతర్జాతీయ స్థాయి నిపుణుల సహాయంతో కాళేశ్వరం బ్యారేజీ పునరుద్ధరణ పనులను అప్పగించామని స్పష్టం చేశారు. ఏలాంటి రాజకీయ రంగు పులమకుండా పూర్తి పారదర్శకతతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

**కమీషన్ల కోసం ప్రాజెక్టు అంచనాలు పెంపు.. భవిష్యత్తు తాకట్టు**

తెలంగాణ ప్రజల కష్టాలకు పూర్తిగా బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని మంత్రి ఉత్తమ్ ధ్వజమెత్తారు. అసలు కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పనే ఒక తప్పుడు నిర్ణయమని, కేవలం కమీషన్ల కోసమే దీన్ని భారీ వ్యయంతో నిర్మించారని ఆరోపించారు. ప్రాణహిత నది జలాలను ఉపయోగించి సులభంగా 16 లక్షల ఎకరాలకు నీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ, నాణ్యతా లోపాలతో కూడిన నిర్మాణాల వల్ల బ్యారేజీలు కూలిపోయాయని విమర్శించారు. కేవలం రూ. 38 వేల కోట్ల అంచనా వ్యయాన్ని ఏకంగా లక్షన్నర కోట్లకు పెంచి మన పిల్లల భవిష్యత్తును తాకట్టు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం కోసం పెట్టిన ఖర్చును ఇతర ప్రాజెక్టుల కోసం కేటాయిస్తే లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని, కేసీఆర్ అండ్ కంపెనీ తెలంగాణ ఇరిగేషన్ రంగాన్ని సర్వనాశనం చేశారని దుయ్యబట్టారు.

**జోసెఫ్ గోబెల్స్‌ను మించిన ప్రచారం.. బీఆర్ఎస్ నేతలపై విమర్శలు**

రాష్ట్రంలో తలెత్తిన లోటు వర్షపాతానికి, ప్రస్తుత ఇబ్బందులకు బీఆర్ఎస్ పాలనా వైఫల్యమే కారణమని మంత్రి స్పష్టం చేశారు. ప్రాణహితచేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ , దేవాదుల, సీతారామ ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంలో చాలా తక్కువగా ఉండేదని తెలిపారు. తమ ఘోర వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని, జోసెఫ్ గోబెల్స్‌ను మించి అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సంతోషించే తత్వం బీఆర్ఎస్ నాయకులదని విమర్శించారు. కన్నెపల్లికి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలు.. 'మేమే కట్టాము, మేమే కూల్చాము' అని ప్రజలకు చెబుతారా అని ప్రశ్నించారు.
కాంగ్రెస్ హయాంలో రికార్డు స్థాయి పంట ఉత్పత్తి
కాళేశ్వరం బ్యారేజీలు నిరుపయోగంగా మారినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న సమర్థవంతమైన చర్యల వల్ల రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పంట ఉత్పత్తి జరిగిందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో పోలిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే కృష్ణా, గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకుని ఎక్కువ పంటలు పండించామని వివరించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్న ప్రతిపక్షాల తీరును ప్రజలు గమనించాలని కోరారు.

# పవర్‌గ్రిడ్ మహిళల వాష్‌రూమ్‌లో రహస్య కెమెరా కలకలం

హైదరాబాద్, సిటీటైమ్స్

హైదరాబాద్ నగరంలోని కవాడిగూడలో ఉన్న పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ కార్యాలయంలో దారుణ ఘటన వెలుగుచూసింది. మహిళల వాష్‌రూమ్‌లో రహస్యంగా మొబైల్ ఫోన్ అమర్చి అనుచితంగా వీడియోలు చిత్రీకరించేందుకు ప్రయత్నించిన ఘటన ఉద్యోగుల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై చర్యలు చేపట్టిన పోలీసులు ఫ్లోర్ అటెండెంట్‌గా పనిచేస్తున్న భరత్‌ను అరెస్ట్ చేశారు. కేసు సున్నితమైనది కావడంతో లోతైన విచారణ నిమిత్తం గాంధీనగర్ ఠాణా నుంచి సిటీ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం.. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్‌లో ఉన్నత స్థాయిలో పనిచేస్తున్న ఓ మహిళ అక్టోబర్ 13 ఉదయం 10:30 గంటల సమయంలో ఆరో అంతస్తులోని మహిళల వాష్‌రూమ్‌కు వెళ్లారు. అక్కడ కమోడ్‌కు ఎదురుగా ఉన్న వాష్‌బేసిన్ కింద తెల్ల కాగితంతో కప్పి ఉన్న ఓ వస్తువుకు రెండు రంధ్రాలు కనిపించాయి. తొలుత దానిని రూమ్ ఫ్రెషనర్‌గా భావించిన ఆమె, అనుమానం వచ్చి పరిశీలించగా గోడకు డబుల్ సైడెడ్ టేప్‌తో మొబైల్ ఫోన్ అతికించి ఉన్నట్లు గుర్తించి షాక్‌కు గురయ్యారు. సదరు ఫోన్‌ను తీసుకుని బయటకు వచ్చిన ఆమె, అదే అంతస్తులో విధులు నిర్వర్తిస్తున్న అటెండెంట్ భరత్‌ను దీనిపై ప్రశ్నించారు. దీంతో అతడు ఆమె చేతిలోని ఫోన్‌ను లాక్కుని పారిపోయేందుకు యత్నించాడు. వెంటనే ఆమె హెచ్చరించడంతో హెచ్‌ఆర్ విభాగం, భద్రతా సిబ్బంది అతడిని ప్రధాన ద్వారం వద్ద పట్టుకున్నారు. ఫోన్‌లోని వీడియోలను పరిశీలించేందుకు సిబ్బంది ప్రయత్నించగా, ఫోల్డర్‌కు పిన్ లాక్ కనిపించింది. పాస్‌వర్డ్ చెప్పాలని నిలదీయడంతో, ఆధారాలు దొరక్కుండా ఉండేందుకు నిందితుడు ఫోన్‌ను లాక్కుని నేలకేసి కొట్టి ధ్వంసం చేశాడు. ఆ అంతస్తులోని వాష్‌రూమ్‌ను సుమారు ఆరుగురు మహిళా ఉద్యోగులు వాడుతున్నారని, ఈ ఘటనతో వారంతా తీవ్ర ఆందోళనకు లోనయ్యారని బాధితురాలు పేర్కొన్నారు. ఫోన్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపి అందులోని సమాచారాన్ని వెలికితీయాలని, ఈ వ్యవహారంలో భరత్‌తో పాటు ఇతరుల ప్రమేయం ఉందా అనే కోణంలో తేల్చాలని డిమాండ్ చేశారు. ర్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేయగా, ప్రస్తుతం సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు భారతీయ న్యాయ సంహిత (BNS)లోని సెక్షన్లు 77, 238తో పాటు ఐటీ చట్టం సెక్షన్ 66E కింద కేసును రీరిజిస్టర్ చేసుకుని దర్యాప్తును వేగవంతం చేశారు.

# ఆర్టికల్ 370 కోసం ఉద్యమిస్తాం ఫరూఖ్ అబ్దుల్లా కీలక ప్రకటన!

- కేంద్ర ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు
- హక్కులు కోరడం దేశవ్యతిరేకం కాదు

శ్రీనగర్, సిటీటైమ్స్



ఆర్టికల్ 370 పునరుద్ధరణ, జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా తిరిగి కల్పించాలనే డిమాండ్లపై తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆయన ఆరోపించారు. జమ్మూకాశ్మీర్ ప్రజలు తమ హక్కులు, ప్రత్యేక గుర్తింపును కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. శనివారం బారాముల్లాలోని డాక్ బంగ్లాలో పార్టీ కార్యకర్తలతో మాట్లాడిన ఆయన.. ప్రజలు ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని అన్నారు. ''మనకు ధైర్యం ఉంటే మనం వారితో పోరాడుతాం.. లేకపోతే తుడిచిపెట్టుకుపోతాం'' అని కార్యకర్తల్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. విభేదాలను పక్కన పెట్టి ఐక్యంగా ముందుకు సాగితే విజయం సాధించొచ్చని అన్నారు. జమ్మూకాశ్మీర్ ప్రత్యేక గుర్తింపును బీజేపీ, కేంద్ర ప్రభుత్వం బలహీనపరుస్తోందని ఫరూఖ్ అబ్దుల్లా విమర్శించారు. ఆర్టికల్ 370 కోసం తమ పార్టీ పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. తమ హక్కుల కోసం పోరాడటం దేశానికి వ్యతిరేకం కాదని అన్నారు. ''తాము గాంధీనెహ్రూల భారతదేశానికి చెందిన వాళ్లం, మా దేశభక్తిని ఎందుకు ప్రశ్నిస్తున్నారు'' అని అన్నారు. తమ హక్కులు, డిమాండ్లను దేశవ్యతిరేక చర్యగా చిత్రీకరించడం సరికాదని అన్నారు.

Printed by Published by SHANKARI SHIVA KUMAR on behalf of SHANKARI SHIVA KUMAR, published at H. NO. 290/1/A, LINGAN PALLY, NEAR GOVT SCHOOL, GOPANPALLY, SERILINGAMPALLY RANGAREDDY TELANGANA 500046, Printed by KAMATHAM SATEESH KUMAR , at SATISH GRAPHICS, 18456/1, NEAR VENKATESWARASWAMY TEMPLE, CHIKKADAPALLY, HYDERABAD, TELANGANA – 500020. Editor SHANKARI SHIVA KUMAR. Chief Editor: N.RamaKrishna Reddy. Phone: 9912074220, 9704616666 Mail: citytimesdaily.com.